
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
కృష్ణా జిల్లా వార్తలు
సోమవారం 1 డిసెంబరు 2025



దిత్వా తుఫాను అన్నదాతలను వణికిస్తుంది. ఆదివారం ఉదయం నుంచి జిల్లావ్యాప్తంగా చిరుజల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో వరి పంటను కాపాడుకునేందుకు రైతులు ఉరుకులు, పరుగులు పెట్టారు. యంత్రాల ద్వారా కోతలు పూర్తి చేసి, రోడ్లపై ఆరబెట్టిన వారు ధాన్యం నింపేందుకు గోనె సంచులు, రవాణా చేసేందుకు వాహనాలు అందుబాటులో లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ నెల 3వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయనే వాతావరణశాఖ హెచ్చరికలు రైతులను మరింత ఆందోళనకు గురిచేస్తున్నాయి.

వణికిస్తున్న దిత్వా!

తుఫాను ప్రభావంతో జిల్లావ్యాప్తంగా చిరు జల్లులు

రహదారులపై గుట్టలుగా ధాన్యం రాశులు

- 3వ తేదీ వరకు కోస్తాతీరం వెంబడి వర్షం కురిసే అవకాశం
- గోనె సంచులు, వాహనాలు అందుబాటులో లేక రైతుల అవస్థలు

ఆంధ్రజ్యోతి- మచిలీపట్నం : జిల్లాలో దిత్వా తుఫాను ప్రభావంతో ఆదివారం తెల్లవారుజాము నుంచే అక్కడక్కడ చిరు జల్లులు ప్రారంభమయ్యాయి. దీంతో అన్నదాతలు ధాన్యం ఎక్కడ తడిచిపోతుందోననే భయంతో వణికిపోయారు. జిల్లాలో 1.61 లక్షల హెక్టార్లలో వరి సాగు చేశారు. ఇప్పటివరకు 55 వేల హెక్టార్లలో వరికోతలను రైతులు పూర్తి చేశారు. మరో 1.06 లక్షల హెక్టార్లలో వరి కోయాల్సి ఉంది. జిల్లాలో ఉదయం నుంచి తేలికపాటి వర్షం కురుస్తూనే ఉండటంతో ఇప్పటికే కోతలు పూర్తిచేసి రహదారులపై గుట్టలుగా పోసిన ధాన్యం ఆరబెట్టుకునేందుకు అవకాశం లేకుండా పోయింది. ధాన్యం రాశులపై పరదాలు కప్పి ఉంచారు. భారీ వర్షం కురవకపోవడంతో రైతులు కొంతమేర ఊపిరిపీల్చుకున్నారు. కానీ వర్షం కారణంగా మిగతా 6లో..

నెలరోజుల వ్యవధిలో రెండో తుఫాను!

గత నెల చివరిలో మొంథా తుఫాను కారణంగా బలమైన గాలులు వీయడంతో ఈత దశలో ఉన్న వరి నేలవాలింది. బలమైన గాలుల కారణంగా గింజలు పగిలిపోయి పాలుపోసుకోలేదు, ఉన్న పంటను కాపాడుకున్న రైతులకు తాజాగా దిత్వా తుఫాను రూపంలో వచ్చిన విపత్తు నిద్రలేకుండా చేస్తోంది. జిల్లాలో దాదాపు అన్ని మండలాల్లో వరి కోతకు సిద్ధమైంది. ఈ తరుణంలో దిత్వా తుఫాను ప్రభావంతో కురుస్తున్న తేలికపాటి వర్షం వరిపంటకు మరింత కీడు చేస్తుందని రైతులు చెబుతున్నారు. గంట, రెండు గంటలపాటు వర్షం కురిసి, ఆ తర్వాత ఎండకాస్తే ప్రమాదం ఉండదని, రోజంతా తేలికపాటి వర్షం కురిస్తే కంకులు తడిచి ధాన్యం మెత్తబడిపోతుందని అంటున్నారు.

మచిలీపట్నం మండలం ఎస్ఎన్ గొల్లపాలెం వద్ద లారీలోకి ధాన్యం లోడు చేస్తున్న కూలీలు



జాడలేని వాహనాలు!

జిల్లాలో ధాన్య రవాణా చేసేందుకు మూడు వేలకుపైగా వాహనాలను అందుబాటులో ఉంచామని అధికారులు చెబుతున్నారు. ఈ వాహనాలు ఎక్కడా ఉన్నాయో తెలియని పరిస్థితి. రైతులు ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో కలెక్టర్ బాలాజీ చొరవ తీసుకుని గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు వ్యాగన్లను జిల్లాకు రప్పించి వాటి ద్వారా సామర్లకోటలోని మిల్లులకు 15 వేల టన్నుల ధాన్యం పంపారు. మరో రెండు రోజుల వ్యవధిలో ఇంకో రెండు వ్యాగన్ల ద్వారా ధాన్యం తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. ఇంతా చేస్తున్నా గ్రామస్థాయిలో దళారులు, ఆర్ఎస్కేలలో పనిచేసే సిబ్బంది కుమ్మక్కై, విపత్కర పరిస్థితిలో ధాన్యం రవాణా చేసేందుకు వాహనాలు అందుబాటులో లేవని చెప్పి రైతులను ఒత్తిడికి గురిచేసి, తక్కువ ధరకు ధాన్యం విక్రయించేలా తెరవెనుక కథ నడుపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.



డ్రగ్స్ వద్దు బ్రో సైకిల్ తొక్కు బ్రో

- గుడివాడలో సందడిగా సైక్లోథాన్-2025 ర్యాలీ
- ఉత్సాహంగా పాల్గొన్న యువత, విద్యార్థులు
- డ్రగ్స్ మహమ్మారిని ఐక్యంగా తరిమికొడదామని వక్తల పిలుపు

ఎన్టీఆర్ స్టేడియం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, గుడివాడ సైక్లింగ్ క్లబ్ ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో- సైకిల్ తొక్కు బ్రో' నినాదంతో గుడివాడలో సైక్లోథాన్-2025 ర్యాలీని ఆదివారం ఉత్సాహంగా నిర్వహించారు. విద్యార్థులు, యువత నుంచి విశేష స్పందన లభించింది. ఐక్యంగా డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదామని ఈ సందర్భంగా వక్తలు పిలుపునిచ్చారు. 6

రైతుకు నష్టం చేసే విత్తన బిల్లును వ్యతిరేకించాలి

రౌండ్‌టేబుల్‌లో వక్తలు 6



రేషన్ మాయ!

మండల స్థాయి స్టాక్ పాయింట్లకు గోడౌన్ల కరువు

బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యం తూకంలో భారీగా తేడాలు

- తూకం, నాణ్యతా ప్రమాణాల నిర్ధారణ పరీక్షలు గాలికి..
- ఎంఎల్ఎస్ పాయింట్లలో జాడలేని వేబ్రిడ్జిలు
- వచ్చే సరుకు, కాగితాలపై ఉన్న సంఖ్యకు మధ్య వ్యత్యాసం
- భారీస్థాయిలో పక్కదారి పడుతున్న పేదల బియ్యం



ఉమ్మడి కృష్ణాజిల్లాలో రేషన్ దందా భారీ స్థాయిలో నడుస్తోంది. మండల స్థాయి స్టాక్ పాయింట్లకు సొంత గోడౌన్లు లేకపోవడంతో నాన్ సైంటిఫిక్ గోడౌన్లనే వినియోగిస్తున్నారు. ఇక్కడకు వచ్చే బియ్యం తూకంలో భారీగా తేడాలు ఉంటున్నాయి. తూకం, నాణ్యతా ప్రమాణాలు నిర్ధారణ పరీక్షలను గాలికి వదిలేశారు. ఆయా పాయింట్లలో వేబ్రిడ్జిల జాడ లేకపోవడంతో మిల్లుల నుంచి వచ్చే సరుకు, కాగితాలపై ఉన్న సంఖ్యకు మధ్య వ్యత్యాసం ఉన్నా సర్దుకోవాల్సిన పరిస్థితి. ఎవరి స్థాయిలో వారు అక్రమాలకు పాల్పడుతూ పేదల బియ్యాన్ని పక్కదారి పట్టిస్తున్నారనే విమర్శలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): ఉమ్మడి కృష్ణాజిల్లాలో మండల స్థాయి స్టాక్ (ఎంఎల్ఎస్) పాయింట్ల ద్వారా ప్రజలకు అందించాల్సిన బియ్యం పక్కదారి పడుతోంది. చాలా చోట్ల ఎంఎల్ఎస్ పాయింట్లకు సొంత గోడౌన్లు లేవు. నాన్ సైంటిఫిక్ గోడౌన్లలో ఎంఎల్ఎస్ పాయింట్లు నడుస్తున్నాయి. బందరులో పేర్ని నాని సతీమణికి చెందిన గోడౌన్‌లో ఇలాగే బియ్యం బస్తాలు మాయం అయ్యాయి. అవి ఎక్కడికి పోయాయన్నది ఇప్పటి వరకు తెలియదు. ఇలాంటివి ఒక ఎత్తు అయితే బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యానికి సరైన తూకం ఉండటం లేదని తెలిసింది. మిల్లర్లతో కుమ్మక్కైన ఫలితంగా బఫర్ గోడౌన్లకు మిల్లర్లు ఎంత పరిమాణంలో బియ్యం ఇస్తే అంతే దిగుమతి చేసుకుంటున్నారు. రైస్ మిల్లుల నుంచి బఫర్ గోడౌన్లకు వచ్చే బియ్యం బస్తాలు ఒక్కొక్కటి 51 కేజీలను కలిగి ఉండాలి. ప్రభుత్వం ఇచ్చే కొత్త గోనె సంచి పరిమాణం 580 గ్రాములు ఉంటుంది. ఇది కాకుండా పోషకాలతో కూడిన కెర్నెల్స్‌ను ప్రభుత్వం రైస్ మిల్లర్లకు అందిస్తుంది. ఒక్కో బస్తాకు ఒక కేజీ చొప్పున ప్రభుత్వం ఇచ్చిన కెర్నెల్స్‌ను కలపాల్సి ఉంటుంది. కాబట్టి రైస్ మిల్లరు ఖచ్చితంగా 51 కేజీల పరిమాణంతో ఉన్న బస్తాను ఇవ్వాల్సిందే. బఫర్ గోడౌన్లకు వచ్చిన బియ్యం బస్తాలను ఖచ్చితంగా వేబ్రిడ్జి మీద పెట్టి తూకం తూయాలి. బఫర్ గోడౌన్లలో వేబ్రిడ్జితో తూకం మిగతా 6లో..

ప్రక్షాళన అవసరం!

బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లలో పారదర్శక విధానాలు తీసుకురావటానికి వీలుగా ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో టెక్నికల్ స్టాఫ్ అంతా కూడా కాంట్రాక్టు ప్రాతిపదికన వచ్చిన వారే ఉన్నారు. పూర్తి స్థాయిలో కూడా సిబ్బంది ఉండరు. కాటా వేయటంతో పాటు, క్వాలిటీ చెక్ కూడా వీరే చేయాలి. ఇవన్నీ ఎక్కడా పెద్దగా జరుగుతున్న దాఖలాలు లేవని సమాచారం. కాంట్రాక్టు సిబ్బంది బియ్యం బస్తాలన్నింటినీ ఓకే చేయించి లాట్ వేయిస్తారు. ఎలా ఓకే చేస్తున్నారు? లాట్ చేయించే విధానాల మీద తనిఖీలు లేవని తెలిసింది. మిల్లు నుంచి బఫర్ గోడౌన్‌కు వస్తున్న బియ్యం అసలైనవేనా ? బయటి నుంచి వస్తున్నాయా ? అన్న అంశాలు పరిశీలించటం లేదని సమాచారం. క్రమం తప్పకుండా తనిఖీలు ఉంటే గతంలో కైకలూరు ఎంఎల్ఎస్ పాయింట్ నుంచి వేలాది బియ్యం బస్తాలు, బందరులో మాజీ మంత్రి పేర్ని నాని సతీమణి గోడౌన్‌లో భారీ స్థాయిలో బియ్యం బస్తాలు పక్కదారి పట్టేందుకు అవకాశం ఉండేది కాదని విమర్శలు ఉన్నాయి.

పట్టాలెక్కనున్న పాసింజర్ రైలు

మోటమర్రి నుంచి జగ్గయ్యపేట వరకు ట్రాక్ పనులు ప్రారంభం

ముమ్మరంగా జంగిల్ క్లియరెన్స్, కల్వర్టు నిర్మాణం

జగ్గయ్యపేట రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): జగ్గయ్యపేట ప్రజల దశాబ్దాల కల అయిన పాసింజర్ రైలు పట్టాలెక్కేందుకు రంగం సిద్ధమైంది. దక్షిణ మధ్య రైల్వే రూ.1,780 కోట్ల వ్యయంతో ఖమ్మం, మోటమర్రి నుంచి వయా జగ్గయ్యపేట మీదుగా నల్గొండ జిల్లా విష్ణుపురం వరకు 88.5 కిలోమీటర్ల మేర రెండవ ట్రాక్ నిర్మాణ పనులు మండలంలో ప్రారంభించింది. విశాఖ స్టీల్ ప్లాంట్‌కు రా మెటీరియల్ సరఫరా చేసేందుకు మూడు దశాబ్దాల క్రితం మోటమర్రి నుంచి గనుల వరకు లైన్ నిర్మించారు. అనంతరం సిమెంట్ కర్మాగారాలు పెరగటంతో అంచలంచెలుగా మిర్యాలగూడ సమీపంలోని విష్ణుపురం వరకు లైన్ పొడిగించి టీటీ నగర్, నడికుడి వరకు అనుసంధానం చేశారు. రెండు దశాబ్దాలుగా ఈ ప్రాంతంలోని ప్రజాప్రతినిధులు పాసింజర్ రైలు నడపాలని ప్రతిపాదనలు పంపినా కార్యరూపం దాల్చలేదు. రెండవ లైన్ పూర్తైతే ఇబ్బందులు తొలగుతాయి. 88.5 కిలోమీటర్లను 4 ఫేజ్‌లుగా విభజించి రెండు టెండర్‌లు ఆమోదం కావవటంతో డీసీసీ ఇన్ ప్రాజెక్టు లిమిటెడ్ ఆధ్వర్యంలో మోటమర్రి నుంచి జగ్గయ్యపేట వరకు పనులు ప్రారంభమయ్యాయి. జాతీయ రహదారి పక్కన చిల్లకల్లు వద్ద కంపెనీ తాత్కాలిక ప్రాజెక్టు ఏర్పాటు చేసి పనులకు శ్రీకారం చుట్టింది. ప్రస్తుతం ఉన్న మార్గానికి సమాంతరంగా జంగిల్ క్లియరెన్స్‌తో పాటు కల్వర్టు పనులు చేపట్టారు.



రైల్వే ట్రాక్‌కు సమాంతరంగా జరుగుతున్న జంగిల్ క్లియరెన్స్

వత్సవాయి మండలం లింగాల వద్ద మునేటిపై జగ్గయ్యపేట మండలం కె.అగ్రహారం వద్ద పాలేటిపై బ్రిడ్జిలను నిర్మించాల్సి ఉంది. రెండవ ట్రాక్ పనులు పూర్తి చేయాలని దిశానిర్దేశం చేసినా రేపూరు, రామాపురం టెండర్‌లు ఆమోదం లభించకపోవటంతో ఆలస్యం కావచ్చని భావిస్తున్నారు. 2030 నాటికి హైదరాబాద్-విజయవాడ 3వ ట్రాక్ సిద్ధమవుతుంది. ఇప్పటికే మోటమర్రి నుంచి విష్ణుపురం వరకు చాలా ప్రాంతాలలో స్టేషన్‌ల నిర్మాణం కూడా పూర్తై అన్ని సదుపాయాలతో సిద్ధంగా ఉన్నాయి.

ప్రారంభానికి ముందే ప్రమాదాలు

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై తరచూ ఢీకొంటున్న వాహనాలు

- రాంగ్‌రూట్‌లో రావడమే ప్రధాన కారణం
- బైపాస్ ప్రారంభానికి మరో ఆరు నెలల సమయం!
- ప్రమాద స్థలాలను గుర్తించి సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకుల వినతి



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన టిప్పర్

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ వెస్ట్ బైపాస్ ప్రారంభం కాకముందే రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారుతోంది. ఆరు లేన్లతో విశాలంగా విస్తరించి ఉండటంతో ఇష్టారాజ్యంగా వాహనాలు నడుపుతున్నారు. చిన్న వాహనాలతో పాటు భారీ వాహనాలు కూడా రాంగ్ రూట్‌లో వస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నాయి. రోడ్డు రెండు వైపులా ఖాళీగా ఉన్నప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ ప్రమాదాల బారినపడుతున్నారు. గత శనివారం అర్ధరాత్రి ఒక టిప్పర్ రాంగ్ రూట్‌లో వస్తూ ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి ఆర్అండ్‌బీ గోడను బలంగా ఢీకొనడంతో లారీ నుజ్జునుజ్జు అయింది. ఈ ప్రమాదంలో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. టిప్పర్‌ను రోడ్డు మీద నుంచి తొలగించడానికి రెండు క్రేన్ల సహాయం తీసుకోవాల్సి వచ్చింది. కాగా, వెస్ట్‌బైపాస్‌పై గతంలో జరిగిన ప్రమాదాల్లో ఇద్దరు, ముగ్గురు చనిపోయిన ఘటనలు కూడా ఉన్నాయి. దసరా ఉత్సవాల సమయంలో నున్న వద్ద 2 ద్విచక్ర వాహనాలు ఢీకొని యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఈ ఘటనలోను రెండు ద్విచక్ర వాహనాలు ఎదురెదురుగా రావడంతో ప్రమాదం జరిగింది. బైపాస్ ప్రారంభానికి ముందే ప్రమాదాలు జరగడంపై అధికారులు వెంటనే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించి ముందస్తు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి. ప్రస్తుతం ఈ రోడ్డుపై నుంచి భారీ వాహనాలు వెళ్లకుండా నియంత్రించాలని వాహనదారులు కోరుతున్నారు. వెస్ట్ బైపాస్ ప్రారంభించడానికి కనీసం ఆరు నెలల సమయం పట్టే అవకాశం ఉంది.

భక్తజనకీలాద్రి



కొండ దిగువన భక్తుల రద్దీ



అంతరాలయ దర్శనం క్యూలైన్లలో వేచివున్న భక్తులు

ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం ప్రాంగణంలోని అన్ని క్యూలైన్లు కిక్కిరిసిపోయాయి. ఉదయం నుంచే భారీగా భక్తులు రావడంతో ఈవో వి.కె.శీనానాయక్ ప్రత్యేక ఏర్పాట్లు చేయించారు. వృద్ధులు, దివ్యాంగులు, చంటి పిల్లలతో వచ్చిన మహిళలకు ఓం టర్నింగ్ వద్ద నుంచి ప్రత్యేక బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేశారు. కొండ దిగువన కనకదుర్గానగర్ నుంచి మహామండపం వరకు భక్తుల రాకపోకలతో రద్దీ ఏర్పడింది.

-(ఆంధ్రజ్యోతి-ఇంద్రకీలాద్రి)

అందుబాటులోకి దుర్గగుడి వెబ్‌సైట్

అప్టా రాష్ట్ర నూతన కార్యవర్గం



యూపీఎస్సీ పరీక్షకు 37.25 శాతం హాజరు

కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలి

సీపీఐ రాష్ట్ర నేత కేవీవీ ప్రసాద్ 6



హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి దంపతులకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో శీనానాయక్

దుర్గమ్మ సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి

ఇంద్రకీలాద్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మను ఆదివారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జ్యోతిర్మయి కుటుంబసభ్యులతో కలసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఈవో వీకే శీనానాయక్, అధికారులు, అర్చకులు వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వారికి వేదపండితులు వేద ఆశీర్వచనం అందచేయగా, ఈవో అమ్మవారి చిత్రపటం, లడ్డూ ప్రసాదం, శేషవస్త్రం అందజేశారు.

అందుబాటులోకి దుర్గగుడి వెబ్‌సైట్

ఇంద్రకీలాద్రి : దుర్గామల్లేశ్వర దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం దర్శనం, ఆర్జిత సేవలు, ప్రసాదాలు, వసతి, రూమ్స్ బుకింగ్ ఆన్‌లైన్ ద్వారా బుకింగ్ చేసుకునేందుకు ఆలయ వెబ్‌సైట్ అందుబాటులోకి వచ్చినట్టు ఈ.వో వీకే శీనానాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్‌టిటిపిఎస్‌://డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.కనకదుర్గమ్మ.ఓఆర్‌జి వెబ్‌సైట్ ద్వారా దేవస్థానంలో పూజల వివరాలు, వసతుల గురించి తెలుసుకోవచ్చునని ఈవో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాల్సిందిగా ఆయన ఒక ప్రకటనలో కోరారు.

జిల్లాలో రోడ్ల విస్తరణకు టెండర్ల ఆహ్వానం

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు ప్రాంతాల రోడ్ల విస్తరణ, మరమ్మతులకు రోడ్లు భవనాల(ఆర్అండ్‌బీ) సంస్థ తాజాగా టెండర్లు ఆహ్వానించింది. అధ్వాన స్థితిలో ఉన్న, రద్దీ అధికంగా ఉండే కొన్ని ప్రాంతాల రహదారులను మరమ్మతులతో విస్తరణ చేయడానికి ఆర్అండ్‌బి నిర్ణయించింది. జిల్లాలో నాలుగు రహదారులకు సంబంధించి మొత్తం రూ.12..44 కోట్లతో పనులు చేయడానికి నిర్ణయించింది. నూజివీడు-మైలవరం రోడ్డును రూ.4.02 కోట్లతో, చిల్లకల్లు, వేదాద్రి, బండిపాలెం, కొనకంచి(జగ్గయ్యపేట-యాదాద్రి) రోడ్డుకు రూ.3.21 కోట్లతో, జగ్గయ్యపేట-షేర్ మహమ్మద్‌పేట రోడ్డుకు రూ.2.71 కోట్లు, కేజీవై బైపాస్, ఎన్‌హెచ్65-గోకరాజుపల్లి రోడ్డు వయా గండేపల్లి, నందలూరు, తాటిగుమ్మి రోడ్డును రూ.2.40 కోట్లతో మరమ్మతులకు టెండర్లను ఆహ్వానిస్తూ ఆర్అండ్‌బీ ఉత్తర్వులిచ్చింది.

అప్టా రాష్ట్ర అధ్యక్షుడిగా ప్రకాశరావు ఎన్నిక



అప్టా రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులను సత్కరిస్తున్న నేతలు

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఏపీ ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ (అప్టా) రాష్ట్ర అధ్యక్షుడిగా కాకి ప్రకాశరావు ఎన్నికయ్యారు. మచిలీపట్నం సన్‌స్టార్ స్కూల్‌లో ఆదివారం జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా కాకి ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శిగా ఎంజి మెహది ఎన్నికయ్యారు. ప్రస్తుత అధ్యక్షుడు ఎస్.జి.ఎస్. గణపతిరావు పదవీ విరమణతో ఈ పోస్టును ఎన్నిక ద్వారా భర్తీ చేశారు. కర్నూలు జిల్లాకు చెందిన కాకి ప్రకాశరావును, కృష్ణాజిల్లాకు చెందిన ఎంజి మెహదిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు కాకి ప్రకాశరావు మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా పనిచేసే ఎస్జీటీలకు శాసనమండలి ఎన్నికల్లో ఓటు హక్కు కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలల్లో ఉన్న ప్రైమరీ తరగతులను విడదీయవద్దని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. సమావేశంలో రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి నారాయణరావు, తెలంగాణా రాష్ట్ర ప్రైమరీ టీచర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు సతీష్ శర్మ, అప్టా రాష్ట్ర ఎన్నికల అధికారి రాజాసాగర్ మాట్లాడారు. వివిధ జిల్లాల సంఘ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

యూపీఎస్సీ పరీక్షకు 37.25 శాతం హాజరు

» పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్ లక్ష్మీశ



పరీక్షా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

కలెక్టరేట్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్/అకౌంట్ ఆఫీసర్, అసిస్టెంట్ ప్రావిడెంట్ ఫండ్ కమిషనర్ పోస్టుల భర్తీకి యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన ఈపీఎఫ్ఓ పరీక్ష-2025 ప్రశాంతంగా ముగిసింది. ఉద్యోగ భవిష్య నిధి సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం నగరంలో 15 కేంద్రాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పరీక్ష నిర్వహించగా 5,860 మందికి గాను 2,183 మంది (37.25 శాతం) హాజరయ్యారు. కలెక్టర్ లక్ష్మీశ విజయవాడలోని సీవీఆర్ ఉన్నత పాఠశాల, చిట్టూరి హైస్కూల్, ప్రభాస్ పీజీ కళాశాల పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. ఎక్కడ ఎలాంటి ఇబ్బంది లేకుండా పరీక్షను విజయవంతంగా నిర్వహించడంలో భాగస్వాములైన లైజనింగ్ అధికారులు, వెన్యూ సూపర్‌వైజర్లు, సమన్వయ శాఖల అధికారులకు కలెక్టర్ అభినందనలు తెలిపారు.

జాతీయ తైక్వాండోలో దామిని ప్రతిభ

» 2 బంగారు, 2 రజిత, 1 కాంస్య పతకాలు కైవసం



పతకాలు అందుకుంటున్న విజేత దామిని

ఇబ్రహీంపట్నం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తైక్వాండో ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఉత్తర ప్రదేశ్‌లో ఈనెల 21 నుంచి 23 వరకు జరిగిన జాతీయ తైక్వాండో పోటీల్లో ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం జూపూడి గ్రామానికి చెందిన కలతోటి దామిని ఉత్తమ ప్రతిభచూపి ఐదు పతకాలను సాధించింది. 55-59 కేజీల విభాగంలో రెండు బంగారు, రెండు రజిత, ఒక కాంస్య పతకాన్ని సాధించినట్టు ఉమ్మడి జిల్లా కోచ్ మలిశెట్టి అంకమ్మరావు ఆదివారం తెలిపారు. దామిని గుణదల డాన్‌బోస్కో స్కూల్లో 9.వ తరగతి చదువుతోంది. విద్యార్థినిని పలువురు అభినందించారు.

సైబర్ నేరాలతో అప్రమత్తంగా ఉండాలి

» ప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా అధ్యక్షుడు దాలినాయుడు

విజయవాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాల విషయంలో వృద్ధులు, పెన్షనర్లు అవగాహన పెంచుకోవడంతో జాగ్రత్తగా ఉండాలని రాష్ట్రప్రభుత్వ పెన్షనర్స్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు కె.దాలినాయుడు అన్నారు. నగరంలోని పెన్షనర్స్ హాల్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ప్రతిరోజు అనేకమంది వృద్ధులు, పెన్షనర్లు సైబర్ నేరగాళ్ల బారినపడి డబ్బులు పోగొట్టుకుంటున్నారన్నారు. సైబర్ నేరగాళ్లు ఎక్కువగా వృద్ధులనే టార్గెట్ చేస్తున్న నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో హెల్పేజ్ ఇండియా సైబర్ టెక్నీషియన్ శ్యామ్ పాల్గొని సైబర్ నేరాలు జరిగే తీరు, తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. కార్యక్రమంలో ట్రెజరర్ కె.నాగేశ్వరరావు, జనరల్ సెక్రటరీ బి.విష్ణువర్ధనరావు, పెన్షనర్లు పాల్గొన్నారు.

మత్తుకు దూరంగా ఉందాం

» తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా నడుచుకోవాలి : ఈగల్ ఐజీ రవికృష్ణ

» డ్రగ్స్ మహమ్మారిని తరిమికొడదాం : ఎమ్మెల్యే వెనిగండ్ల

» గుడివాడ సైక్లోథాన్‌కు విశేష స్పందన

» ఉత్సాహంగా పాల్గొన్న 3 వేలమంది విద్యార్థులు



విద్యార్థుల సైకిల్ ర్యాలీలో ఈగల్ ఐజీ రవికృష్ణ, ఎమ్మెల్యే వెనిగండ్ల, ఎస్పీ విద్యాసాగర్, యలవర్తి తదితరులు

గుడివాడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తల్లిదండ్రుల ఆకాంక్షలకు అనుగుణంగా చిన్నారులు మంచి వైపు పయనించాలని, మంచి, చెడు అలవాట్ల వ్యత్యాసాన్ని చిన్నారులకు అలవాటు చేయాలని ఈగల్ టీం ఐజీ ఆకే రవికృష్ణ కోరారు. ఆదివారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియం, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ, గుడివాడ సైక్లింగ్ క్లబ్‌ల



విద్యార్థులను ఉత్సాహపరుస్తున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

సంయుక్త ఆధ్వర్యంలో 'డ్రగ్స్ వద్దు బ్రో-సైకిల్ తొక్కు బ్రో' నినాదంతో నిర్వహించిన గుడివాడ సైక్లోథాన్-2025 10కిలోమీటర్ల ర్యాలీని ఐజీ రవికృష్ణ, ఎమ్మెల్యే వెనిగండ్ల రాము, సుఖదా దంపతులు, స్టేడియం కమిటీ ఉపాధ్యక్షులు యలవర్తి శ్రీనివాసరావులు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐజీ రవికృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. చెడు స్నేహాలతో డ్రగ్స్ బారినపడి ఎందరో అమాయకులు తమ జీవితాలను నాశనం చేసుకున్నారన్నారు. మంచి అలవాట్లతో మనం ఉన్నత స్థాయికి చేరుకోవచ్చునని, చెడు అలవాట్లతో పతనమైపోతామన్నారు. అమ్మానాన్నలు కన్న కలలను నిజం చేసేలా ప్రతిఒక్కరూ మంచివైపు నడవాలని పిలుపునిచ్చారు. డ్రగ్స్ సమాచారం తెలిస్తే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నెంబరు 1972కు సమాచారం అందించాలన్నారు. ఎమ్మెల్యే వెనిగండ్ల రాము మాట్లాడుతూ, రాష్ట్రంలో డ్రగ్స్ నిర్మూలనే లక్ష్యంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కఠిన చర్యలు చేపడుతున్నారన్నారు. డ్రగ్స్ వద్దు బ్రో మనందిరి నినాదం కావాలన్నారు. డ్రగ్స్ వ్యతిరేక ఉద్యమంలో



ఐ లవ్ సైక్లోథాన్ గుడివాడ ప్లకార్డు ఆవిష్కరణ

అందరం భాగస్వామ్యులవుదామని పిలుపునిచ్చారు.

జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మాట్లాడుతూ, డ్రగ్స్ వద్దు బ్రో కార్యక్రమానికి పెద్ద ఎత్తున స్పందన రావడం సంతోషకరమన్నారు. తల్లిదండ్రుల ప్రోత్సాహంతో చిన్నారులు భారీ ఎత్తున అవగాహన ర్యాలీకి తరలివచ్చారన్నారు. సమాజంలో డ్రగ్స్ మహమ్మారిని రూపుమాపడానికి ప్రభుత్వంతో కలిసి పనిచేస్తామని హామీ ఇచ్చారు. తొలుత 'ఫ్రీ సొసైటీ సే నో టూ డ్రగ్స్' ప్లకార్డులను ఆవిష్కరించారు. పట్టణంలోని రహదారులన్నీ విద్యార్థులతో కిటకిటలాడాయి. పట్టణంలో ప్రత్యేకంగా ట్రాఫిక్ డ్రైవ్‌ను చేపట్టారు. ఐఎంఏ గుడివాడ శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. అంబులెన్స్‌ను అందుబాటులో ఉంచారు. ర్యాలీ అనంతరం స్టేడియం కమిటీ తరపున విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఈగల్ టీం ఐపీఎస్ ఉమామహేశ్వరరాజు, మచిలీపట్నం డీఎస్పీ సీహెచ్ రాజా, ఇండియన్ మెడికల్ అసోసియేషన్ గుడివాడ శాఖ అధ్యక్షులు మాగంటి శ్రీనివాస్, స్టేడియం కమిటీ సంయుక్త కార్యదర్శి కిలారపు రంగప్రసాద్, జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, బీజేపీ కన్వీనర్ దావులూరి సురేంద్రబాబు, ఐఎంఏ సభ్యులు డా.పొట్లూరి వంశీకృష్ణ, పట్టణ సీఐలు, ఎస్.ఐలు, ట్రైనీ ఎస్.ఐలు, పోలీసు సిబ్బంది, పలు స్వచ్ఛంద, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.



రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న కౌలురైతుల సంఘం అధ్యక్షుడు రాధాకృష్ణ

రైతుకు నష్టం చేసే విత్తన బిల్లును వ్యతిరేకించాలి

» రౌండ్‌టేబుల్‌లో వక్తలు

గవర్నర్‌పేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతాంగానికి నష్టం కలిగించే కేంద్ర విత్తన బిల్లు-2025ను వ్యతిరేకించాలని రౌండ్ టేబుల్ సమావేశంలో వక్తలు పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం, రైతు సంఘాల ఆధ్వర్యంలో ఆదివారం ఎంజీ రోడ్డులోని బాలోత్సవ్ భవన్‌లో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. సమావేశానికి ఏపీ కౌలు రైతుల సంఘం అధ్యక్షుడు వై.రాధాకృష్ణ అధ్యక్షత వహించారు. సమావేశంలో మాజీ వ్యవసాయ శాఖామంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు మాట్లాడుతూ, రైతు వ్యతిరేక, కార్పొరేట్ శక్తుల అనుకూల కేంద్ర విత్తన బిల్లు-2025 రైతులకు తీవ్ర నష్టం కలిగిస్తుందన్నారు. రాష్ట్రాల పరిధిలో ఉన్న వ్యవసాయాన్ని కేంద్రం తన అధీనంలోకి తెచ్చుకోవడానికి ఉద్దేశించిందన్నారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం వెంటనే రైతు, కౌలు రైతు సంఘాలతో అఖిలపక్ష సమావేశం నిర్వహించి అందరి అభిప్రాయాలు తీసుకుని ముసాయిదాపై కేంద్రప్రభుత్వానికి అభిప్రాయాన్ని తెలియజేయాలని కోరారు. రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు తీర్మానాన్ని ప్రవేశపెడుతూ అమెరికాతో ఫ్రీట్రేడ్ అగ్రిమెంట్‌కు సిద్ధమవడానికి కేంద్ర ప్రభుత్వం ఈ ముసాయిదా బిల్లు తీసుకువచ్చిందన్నారు. వ్యవసాయ శాస్త్ర వేత్త బి.శరత్‌బాబు మాట్లాడుతూ, ఈ బిల్లు రైతుల హక్కులను పూర్తిగా నాశనం చేస్తుందన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్త వేణుగోపాల్ మాట్లాడుతూ, రానున్న కాలంలో ఈ చట్టం ద్వారా రైతులకు మరింత నష్టం కలిగే ప్రమాదముందన్నారు. సమావేశంలో రైతుసంఘం నేత కొల్లా రాజమోహన్, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, వివిధ రైతు సంఘాల నేతలు పాల్గొన్నారు.

కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలి

» సీపీఐ రాష్ట్ర నేత కేవీవీ ప్రసాద్



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న కేవీవీ ప్రసాద్

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు మనోధైర్యంతో ముందుకుసాగాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు కేవీవీ ప్రసాద్ తెలిపారు. కృష్ణాజిల్లా కౌన్సిల్ సమావేశం ఆదివారం చల్లపల్లిలోని శ్రీచంద్ర రాజేశ్వరరావు వికాస కేంద్రంలో జరిగింది. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న కేవీవీ ప్రసాద్ మాట్లాడుతూ, పార్టీని, అనుబంధ సంఘాలను బలోపేతం చేసే దిశగా ముందుకు సాగాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో కమ్యూనిస్టు పార్టీ ప్రాబల్యం చూపాలని పిలుపునిచ్చారు. ప్రస్తుత సమాజంలో కీలకపాత్ర పోషిస్తున్న సామాజిక మాధ్యమాలను సద్వినియోగం చేసుకుని పార్టీల ఆవశ్యకతను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని సూచించారు. ప్రస్తుతం అన్నదాత పరిస్థితి దయనీయంగా ఉందని, పంటలకు గిట్టుబాటు ధరలు రాక రైతులు తీవ్ర నష్టాలను ఎదుర్కొంటున్నారని తెలిపారు. రైతుల సమస్యలపై డిసెంబరు 10న అన్ని జిల్లాల కలెక్టర్ కార్యాలయాల వద్ద ధర్నా నిర్వహిస్తున్నట్టు చెప్పారు. జనవరి 18న తెలంగాణ రాష్ట్రంలోని ఖమ్మంలో జరగబోయే సీపీఐ శతాబ్ది ఉత్సవ సభను విజయవంతం చేయాలని కోరారు. జిల్లా కార్యదర్శి నార్ల వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, పార్టీ సభ్యత్వ నమోదు ప్రక్రియ త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అవనిగడ్డ నియోజకవర్గ కార్యదర్శి గుత్తికొండ రామారావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెలగపూడి ఆజాద్, సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్‌బాబులు ప్రసంగించగా, మహిళా సమాఖ్య జిల్లా కార్యదర్శి మల్లుపెద్ది రత్నకుమారి, జిల్లా కార్యవర్గసభ్యులు తదితరులు పాల్గొన్నారు.


బుర్జువా పార్టీలకు వ్యతిరేకంగా పార్టీ నిర్మాణం జరగాలి

» సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ



మాట్లాడుతున్న సీపీఐ జాతీయ కార్యదర్శి రామకృష్ణ

గాంధీనగర్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుర్జువా పార్టీలకు వ్యతిరేకంగా పార్టీ నిర్మాణం జరగాల్సిన ఆవశ్యకత ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణ ఉద్ఘాటించారు. భారత కమ్యూనిస్టు పార్టీ శత వసంతాల ముగింపు సందర్భంగా ఎన్టీఆర్ జిల్లా సమితి ఆధ్వర్యంలో స్థానిక దాసరిభవన్‌లో నిర్వహించిన వర్క్‌షాప్ ఆదివారం ముగిసింది. ఈ సందర్భంగా జనగణన, కులగణన, రిజర్వేషన్లు, సామాజిక న్యాయం' అంశంపై రామకృష్ణ ప్రసంగించారు. జనగణతో పాటు కులగణనతోనే సామాజిక న్యాయం జరుగుతుందన్నారు. పార్టీ గతంలో కార్మికులు, శ్రామికులు, కర్షకులకు రాజ్యాధికార సాధనకు పోరాడిందని, కుల, మతాలు, సామాజిక అసమానతలపై దృష్టి సారించలేదన్నారు. రాజకీయంగా, సైద్ధాంతిక పరంగా బీజేపీ, ఆర్ఎస్ఎస్‌ను ఎదుర్కొనే శక్తి కేవలం ఒక్క కమ్యూనిస్టు పార్టీ మాత్రమే అన్నారు. 'వర్తమాన రాజకీయ పరిస్థితులు, కమ్యూనిస్టు ఉద్యమం' అంశంపై పార్టీ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రసంగించారు. దేశంలో పెరిగిన ఆర్థిక అసమానతలు, నిరుద్యోగం, పేదరికంపై ప్రజల దృష్టి మళ్లించేందుకు వికసిత్ భారత్ అంటూ ప్రధాని మోదీ దేశప్రజలను మభ్యపెడుతున్నారని విమర్శించారు. అటవీ సంపదను కార్పొరేట్ శక్తులకు దోచిపెట్టేందుకు ఆపరేషన్ కగార్ పేరుతో అమాయక గిరిజన ప్రజల ప్రాణాలు తీస్తున్నారని మండిపడ్డారు. పార్టీ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు సీహెచ్ కోటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు తూము కృష్ణయ్య, లంక దుర్గారావు, బుడ్డి రమేష్, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పరుచూరి రాజేంద్రబాబు, మహిళా సమాఖ్య నేత పంచదార్ల దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.



» అంతకు మించి వేగానికి అనుమతి లేదు

» చిన్న అవుటపల్లి నుంచి కాజ వరకు అవాంతరాలు లేని ప్రయాణం

» మూడు వరసల రోడ్డు కావటంతో.. వేగపరిమితి నిర్దేశం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ)

విజయవాడ వెస్ట్ బైపాస్‌పై గరిష్ఠంగా 100 కిలోమీటర్ల వేగంతో ప్రయాణించవచ్చు. చిన్న అవుటపల్లి నుంచి గొల్లపూడి వరకు ప్యాకేజీ-3, గొల్లపూడి నుంచి కాజవరకు ప్యాకేజీ-4లో భాగంగా త్వరలో ప్రారంభం కానున్న విజయవాడ బైపాస్‌పై స్పీడ్ లిమిట్ ఎంత ఉండాలన్నది జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) నిర్ణయించింది. విజయవాడ వెస్ట్ బైపాస్‌పై గంటకు 100 కిలోమీటర్ల వేగంతో వెళ్లవచ్చు. అంతకు మించి వేగంతో వెళ్లటానికి లేదు. విజయవాడ వెస్ట్ బైపాస్‌ను ఆరువరుసల విధానంలో నిర్మించారు. సెంట్రల్ మీడియం 3 లేన్ల చొప్పున విభజిస్తుంది. బైపాస్‌లోకి ఒకసారి ప్రవేశిస్తే.. ఎక్కడా అవాంతరం అనేది రాదు. ఎక్కడా ఆగాల్సిన పనిలేదు. చిన్న అవుటపల్లి దగ్గర బైపాస్‌లోకి ప్రవేశిస్తే.. నేరుగా కాజ దగ్గర ల్యాండ్ అయ్యేవరకు కూడా ఎక్కడా వాహనం ఆగదు. ఫ్లై ఓవర్లు, ఆర్ఓబీలు, వెహికల్ అండర్ పాస్‌లు, సర్వీసు స్లిప్ రోడ్లు ఉండటం వల్ల వాహనాలు అవాంతరాలు లేకుండా ముందుకువెళతాయి. మూడు లేన్లు కావటంతో వాహనాలు వేగంగా వెళ్లటానికి అవకాశం ఉంటుంది. గరిష్ట వేగం 100 కిలోమీటర్లకు నిర్దేశించటం జరిగింది. ఇంతకు మించి వెళ్లటానికి లేదు. ఒకవేళ వెళితే.. సెన్సార్లు పసిగట్టేస్తాయి. వంద దాటి వెళ్లే ఓవర్ స్పీడ్ డేటా ఎన్‌హెచ్ డేటాబేస్‌కు చేరుతుంది. ఆ తర్వాత జరిమానాలు విధించటం జరుగుతుంది.

అర్ధగంటలోనే గొల్లపూడి..

విజయవాడ మీదుగా హైదరాబాద్ వెళ్లే వాహనదారులకు విజయవాడ గన్నవరం నుంచి విజయవాడ దాటి వెళ్లటానికి గంట నుంచి గంటన్నర సమయం పైగా పడుతోంది. ట్రాఫిక్ సమస్యలను బట్టి ఇంకా పెరుగుతుంది. చిన్న అవుటపల్లి దగ్గర వెస్ట్ బైపాస్ ఎక్కితే గరిష్ఠంగా అర్ధగంట సమయంలోనే గొల్లపూడికి చేరుకుంటున్నారు. విజయవాడలోకి బైపాస్ మీదుగా సింగ్‌నగర్, నున్న, కండ్రిక, జక్కంపూడి, పాతపాడుల నుంచి రావటానికి కేవలం 20నిమిషాలు మాత్రమే పడుతోంది. దీంతో ఏలూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు కానీ, గుంటూరు వైపు నుంచి వచ్చే వాహనాలకు కానీ విజయవాడకు రాకపోకలు సాగించాలంటే చాలా తక్కువ సమయం పడుతుంది.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

ఇంద్రకీలాద్రి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వర దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి ఆదివారం తెలంగాణ రాష్ట్రం మేడ్చర్ల ఎంఎన్‌రెడ్డినగర్‌కు చెందిన ఎం.వి.రామిశెట్టి దుర్గాప్రసాద్ కుటుంబసభ్యులు రూ.1,00,000లు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారిని అమ్మవారి సన్నిధికి తోడ్కొని వెళ్లి దర్శనం కల్పించారు. సూపరింటెండెంట్ చందు శ్రీను దాత కుటుంబానికి అమ్మవారి చిత్రపటం విరాళం రశీదు, లడ్డూప్రసాదం, శేషవస్త్రం అందచేశారు.

రేషన్ మాయ!

(5వ పేజీ తరువాయి)

వేయటంతో తేడాలు కనిపిస్తున్నాయి. కానీ, మిల్లర్లతో ఉన్న రహస్య లావాదేవీల కారణంగా తూకాన్ని పక్కన పెట్టి కాగితాల మీద నిర్ణీత పరిమాణంలో సరుకు ఉందని ఎంఎల్ఎస్ పాయింట్లకు పంపుతున్నారు.

ఎంఎల్ఎస్ పాయింట్లలో కనిపించని వేబ్రిడ్జిలు!

వాస్తవానికి ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యం ఆ స్థాయిలో ఉండటం లేదన్న ఫిర్యాదులు పెద్ద ఎత్తున వస్తున్నాయి. బఫర్ గోడౌన్ల నుంచి ప్రతి నెలా వందలాది టన్నుల బియ్యం ఎంఎల్ఎస్ పాయింట్లకు వస్తుంది. ఎంఎల్ఎస్ పాయింట్లలో చాలా వరకు వేబ్రిడ్జిలు ఉండటం లేదని సమాచారం. బఫర్ గోడౌన్ల నుంచి కాగితాల మీద ఇంత పరిమాణం ఉందని వస్తున్న బియ్యం బస్తాలను ఎంఎల్ఎస్ పాయింట్లలో తూకం వేయటం ద్వారా ఎంత ఉందో నిర్ధారించవచ్చు. కానీ, ఎంఎల్ఎస్ పాయింట్లలో అలాంటిదేమీ జరగటం లేదని తెలిసింది. ఎంఎల్ఎస్ పాయింట్లలో వే బ్రిడ్జిలు అనేవి మచ్చుకు కూడా కనిపించడంలేదని సమాచారం. బఫర్ గోడౌన్లు, ఎంఎల్ఎస్ పాయింట్లలో వేబ్రిడ్జిల తూకం ద్వారా వాటి పరిమాణాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తే అసలు ఎలాంటి సమస్యా రాదు. బఫర్ గోడౌన్లకు, ఎంఎల్ఎస్ పాయింట్లకు కేంద్రం హ్యాండ్లింగ్ లాస్, ట్రాన్సిస్ట్ లాస్‌లను మాత్రమే నిర్ణయిస్తుంది. హ్యాండ్లింగ్ లాస్ అంటే.. హమాలీలు ఇనుమ హుక్కులతో బస్తాలను దించేటపుడు బియ్యం పోతుంది కాబట్టి దానిని హ్యాండ్లింగ్ లాస్ పరిధిలోకి తీసుకువస్తారు. ట్రాన్సిస్ట్ లాస్ అంటే .. ఇలా వచ్చిన బస్తాలను స్టేజ్ -1, స్టేజ్ -2 రవాణా సందర్భాలలో బియ్యం కారే అవకాశం ఉంటుంది. అందుకే దీనిని ట్రాన్సిస్ట్ లాస్ అంటారు. కాబట్టి ఈ రెండింటిని మాత్రమే నిర్దేశించటం జరిగింది. ఈ రెండూ కలిపితే మహా అయితే ఓ 100, 150 గ్రాములు ఉంటుంది. ఇది కూడా కాదని బస్తాలలో బియ్యం తగ్గిపోతోంది. ఎంఎల్ఎస్ పాయింట్లకు వచ్చే బియ్యం బస్తా 51 కేజీలు ఉండాల్సి ఉండగా.. 48, 49 కేజీలు మాత్రమే ఉంటోందని సమాచారం. దీంతో ఎంఎల్ఎస్ పాయింట్ల నిర్వాహకులు కూడా తూకం వేయకుండా కాగితాల మీద లెక్కలతో డీలర్లకు అందిస్తున్నారు. ఎంఎల్ఎస్ పాయింట్లలో అవినీతి సిబ్బంది కొందరు తమ లాభం కూడా చూసుకుంటున్నారని తెలిసింది. అలాగే ఇంకాస్త ఇక్కడ పక్కదారి పట్టించి, లేని సరుకును ఉన్నట్టుగా చూపిస్తూ డీలర్ల నెత్తిన తరుగును మోపుతున్నారని సమాచారం. ఎంఎల్ఎస్ పాయింట్ల ఇన్‌చార్జిలుగా రెవెన్యూ నుంచి చాలా మంది రావటం, వారికి అవగాహన లేకపోవటం వల్ల ఎలా వచ్చిన బియ్యాన్ని అలా తీసుకుని, అదే విధంగా ఇచ్చేస్తున్నారని తెలిసింది. కొన్ని ఎంఎల్ఎస్ పాయింట్లు మరీ దారుణంగా తయారయ్యాయని విమర్శలు ఉన్నాయి. వెయ్యి టన్నుల బియ్యం వస్తే 500 టన్నుల బియ్యం కూడా ఉండని పరిస్థితి నెలకొందని సమాచారం.

గోనె సంచుల వ్యవహారంలో మాయ

ప్రతి ఏడాది మిల్లర్లకు ప్రభుత్వం కొత్త గోనె సంచులను ఇస్తుంది. తిరిగి వచ్చేటపుడు మాత్రం ఆ గోనె సంచులు రావడంలేదని తెలిసింది. కుట్లు వేసినవి, మాసికలు ఉన్నవి వస్తున్నాయని సమాచారం. ఏడాదిలోనే గోనె సంచులు ఈ విధంగా దెబ్బతింటాయా అన్న ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సంచుల బలం తగ్గిపోయి బలహీనంగా మారుతున్నాయి. ఊరికే రంధ్రాలు పడుతున్నాయి. ఈ గోనె సంచుల వ్యవహారాల మీద కూడా ప్రభుత్వం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. అలాగే బఫర్ గోడౌన్లలోకి వచ్చే బియ్యానికి పురుగులు పట్టకుండా గోడౌన్ లోపల పురుగుల మందు పిచికారీ చేస్తారు. కానీ బియ్యంలో పురుగులు వస్తున్నాయన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి. ఎందుకు వస్తున్నాయన్న అంశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది.

వణికిస్తున్న దిత్వా!

(5వ పేజీ తరువాయి)

గాలిలో తేమశాతం పెరిగి, ఆరిన ధాన్యంలోనూ తేమ అధికమవుతుందని, దీంతో పాటు ధాన్యం రాశులపై రోజుల తరబడి పరదాలు కప్పిఉంచితే తేమశాతం పెరిగి ధాన్యం రంగుమారిపోతుందని ఆందోళన చెందుతున్నారు. రెండు, మూడు రోజుల పాటు వాతావరణం ఇలానే ఉంటే ధాన్యం ఆరబెట్టేందుకు అవకాశం ఉండదని, ధాన్యం రాశుల కిందకు నీరుచేరి అడుగున ఉన్న ధాన్యం మొలకెత్తే ప్రమాదం లేకపోలేదని రైతులు అంటున్నారు.

టెక్నికల్ సిబ్బంది, దళారుల మాయాజాలం!

కంకిపాడు, ఉయ్యూరు, మచిలీపట్నం, గూడూరు, చల్లపల్లి, ఘంటసాల, పెడన, బంటుమిల్లి, తోట్లవల్లూరు, మోపిదేవి, మొవ్వ తదితర మండలాల్లో ఇటీవల కాలంలో వరి కోతలు ఊపందుకున్నాయి. యంత్రాల ద్వారా రైతులు కోతలు పూర్తిచేస్తున్నారు. కోసిన అనంతరం ధాన్యాన్ని ట్రాక్టర్‌ల ద్వారా పొలాల సమీపంలోని రహదారులపైకి చేరుస్తున్నారు. రైతు సేవా కేంద్రాలకు ధాన్యం విక్రయించేందుకు రైతులు శాంపిల్స్ తీసుకు వెళితే సంచులు అందుబాటులో లేవని, వాహనాలు ఇప్పట్లో రావని అక్కడి టెక్నికల్ సిబ్బంది చెబుతున్నారు. దీంతో పాటు, ధాన్యం కొనుగోలు చేసే దళారులతో కుమ్మక్కయిన టెక్నికల్ సిబ్బంది ధాన్యం నాణ్యతగా లేదని, తదితర కారణాలు చూపి 75కిలోల బస్తా ధాన్యం రూ.1,450 మించి ధర పలకదని వారే చెప్పేస్తున్నారని తెలిసింది. అదే ధాన్యం శాంపిల్స్‌ను రైతులు మిల్లుల వద్దకు తీసుకువెళితే బస్తాకు రూ.1500 ఇస్తామని అంటున్నారని రైతులు చెబుతున్నారు. ఇదేమని రైతు సేవా కేంద్రాల్లోని టెక్నికల్ సిబ్బందిని ప్రశ్నిస్తే, నిబంధనలు అలానే ఉన్నాయని, అయినా సంచులు, వాహనాలు అందుబాటులో లేవని చెప్పి రైతులను వెనక్కు పంపేస్తున్నారని సమాచారం. జిల్లాస్థాయి అధికారులు, తహసీల్దార్‌లు, వ్యవసాయ శాఖ అధికారుల ఆదేశాలను కూడా ఏమాత్రం పాటించకుండా దళారులు, ఆర్ఎస్‌కేలలో పనిచేసే సిబ్బంది ధాన్యం కొనుగోలును తమ చెప్పుచేతల్లోకి తీసుకుని రైతులను తీవ్ర ఇబ్బందులపాలు చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్‌బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260



నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

హిందూ ధర్మాన్ని పరిరక్షించాలి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): హిందూ ధర్మాన్ని, దేశాన్ని పరిరక్షించాల్సిన బాధ్యత ప్రతి హిందువుకు ఉండాలని హిమాలయం పర్వత డోల్ ఆశ్రమం కల్యాణ్‌దాస్ మహారాజ్‌జీ ప్రధాన శిష్యుడు శ్రీశ్రీ రాఘవానంద స్వామి అన్నారు. హిందూ ధర్మ పరిరక్షణ పేరిట ఉత్తరాఖండ్ అల్మోరా జిల్లా నుంచి రామేశ్వరం మీదుగా కన్యాకుమారి వరకు రాఘవానందస్వామి మే నెలలో చేపట్టిన పాదయాత్ర ఆదివారం హనుమాన్ జంక్షన్ చేరుకుంది. గురూజీ ఆదేశాలు మేరకు తాను పాదయాత్ర చేపట్టినట్లు ఆయన తెలిపారు.



నున్నలో రైతులతో మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ చైతన్య

రైతులు అప్రమత్తంగా ఉండాలి

● సబ్ కలెక్టర్ చైతన్య

విజయవాడ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని సబ్ కలెక్టర్ కావూరి చైతన్య రైతులకు సూచించారు. విజయవాడ రూరల్ మండలం పరిధిలోని నున్న గ్రామంలో ఆదివారం ఆయన పర్యటించారు. కోత కోసిన ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు వాహనాలు ఏర్పాటు చేస్తామని చెప్పారు. అలాగే కోసి కుప్పలు వేసిన ధాన్యం తడవకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, అవసరమైన టార్పాలిన్ పట్టాలను రైతు సేవా కేంద్రంలో అందుబాటులో ఉంచామన్నారు. పంట కోతలను వాయిదా వేసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో వ్యవసాయ శాఖ అధికారులు సిబ్బంది ఉన్నారు.

వరి కోతలు తాత్కాలికంగా వాయిదా వేయాలి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో మండల వ్యాప్తంగా చెదురు మదురు జల్లుల పడుతున్నాయని రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఏవో బి.రంగనాథ్‌బాబు సూచించారు. కానుమోలు, ఆరుగొలను గ్రామాల్లోని ఆర్బీకేల్లో ధాన్యం సేకరణకు అవసరమైన గోనెసంచుల లభ్యత, తేమ శాతం తదితర విషయాలను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. దిత్వా తుఫాను నేపథ్యంలో వరి కోతలను తాత్కాలికంగా వాయిదా వేయాలని, వాతావరణ పరిస్థితులు సాధారణ స్థితికి వచ్చే వరకూ కోతలు ప్రారంభించవద్దన్నారు. కల్లాల్లో ఉన్న ధాన్యం తడవకుండా ఆర్బీకేల్లోని పరదాలను గానీ, తమ వద్ద ఉన్న ప్లాస్టిక్ పరదాలను కప్పి ఉంచి చినుకులు తగ్గగానే గాలి ఆడే విధంగా చూసుకోవాలని సూచించారు. గాలి ఆడకపోతే ధాన్యం ముక్కి పోయే ప్రమాదముందని హెచ్చరించారు.

తుఫాన్‌ను ధైర్యంగా ఎదుర్కొందాం

● రైతులు భయపడొద్దు

● రంగుమారిన, మొలకలొచ్చిన ప్రతి గింజా కొంటాం: ఏవో రమేష్

ఉంగుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫానును ధైర్యంగా ఎదుర్కొందాం - ప్రభుత్వం అండగా వుంది, రైతులు ఎటువంటి భయాందోళనలు చెందవద్దు, వర్షానికి గింజ రంగుమారినా, మొలకొచ్చినా ప్రతి గింజ కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుందంటూ మండల వ్యవసాయాధికారి గద్దె రమేష్ రైతులకు భరోసా ఇచ్చారు. తుఫాన్ నేపథ్యంలో మండలంలోని పలుగ్రామాల్లో రోడ్లపక్కన ఆరబోసిన ధాన్యపు రాశులను ఆదివారం ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. కొన్నిచోట్ల గోనె సంచుల్లో నింపిన ధాన్యాన్ని మిల్లులకు తరలించే ఏర్పాట్లుచేశారు. ఈసందర్భంగా రైతులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. ధాన్యపురాశులపై కప్పేందుకు 420 టార్పాలిన్ పట్టాలను 12 ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతులకు అందజేసినట్లు తెలిపారు. ఇప్పటికే 15వేలమెట్రిక్‌టన్నుల ధాన్యం సేకరించామని, ఆదివారం ఒక్కరోజే 600 మెట్రిక్ టన్నులధాన్యం సేకరించి మిల్లులకు తరలించామన్నారు. నాలుగురోజులపాటు రైతులు కోతలు వాయిదావేయాలన్నారు.



పెదఓగిరాలలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం తడవకుండా రైతులతో కలిసి టార్పాలిన్ కప్పుతున్న తహసీల్దార్ సురేశ్‌కుమార్

ధాన్యం తడవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ఉయ్యూరు: దిత్వా తుఫాన్ హెచ్చరికలతో ఆరబెట్టిన ధాన్యంతో పాటు గోనె సంచుల్లో నింపిన ధాన్యం వర్షానికి తడవకుండా పట్టాలు, టార్పాలిన్లు కప్పి కాపాడుకోవాలని మండల తహసీల్దార్ కె.సురేశ్‌కుమార్ సూచిం చారు. దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం ఆకాశం మబ్బులు కమ్మి చిన్నపాటి వర్షపు చినుకులు పడుతుండటంతో గ్రామాల్లో పర్యటించి రోడ్లపక్కన, ఖాళీస్థలాల్లో ఆరబెట్టిన ధాన్యం, ధాన్యం బస్తాలు చూసి రైతులకు పలుసూచనలు చేశారు. ఆయన మాట్లాడుతూ తుఫాన్ కారణంగా ధాన్యం తడిసి పాడవ్వ కూడదన్న ఉద్దేశంతో మండలానికి 495 టార్పాలిన్లు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేర వ్యవసాయ శాఖ అధికారులకు అందించామని తెలిపారు. గోనె సంచుల్లో నింపిన ధాన్యం లారీలు, ట్రాక్టర్ల ద్వారా మిల్లులకు పంపించే ఏర్పాట్లు చేశామని, రైతులు ఆందోళన చెందవద్దన్నారు.



గారపాడులో రోడ్ల వెంట ఆరబోసిన ధాన్యపు రాశులను పరిశీలించి రైతులకు సూచనలు చేస్తున్న ఏవో రమేష్

రైతులకు టార్పాలిన్ల పంపిణీ

కంకిపాడు: దిత్వా తుఫాన్‌ను దృష్టిలో పెట్టుకొని రైతులకు అవసరమైన టార్పాన్లను ప్రభుత్వం ఉచితంగా అందిస్తుందని తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయి బాబు అన్నారు. మండలంలోని పునాదిపాడు గ్రామంలోని రైతులకు అవసరమైన టార్పాన్లను ఆదివారం ఆయన అందచేశారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ మొంథా తుఫాన్ నుంచి రైతులు ఊపిరి పీల్చుకున్నారంటే ఇప్పుడు దిత్వా తుఫాన్ ఇబ్బందులు పెడుతుందన్నారు. తుఫాను దెబ్బకు రైతులు ఇబ్బందులు పడకుండా ఉండేందుకు అవసరమైన టార్పాన్లను ప్రభుత్వం పంపిణీ చేయడం అభినందనీయమన్నారు. మండలంలోని వివిధ గ్రామాల్లో సుమారు 485 టార్పాన్లను రైతులకు అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఏవో ఉషారాణి పాల్గొన్నారు.



రైతులకు టార్పాలిన్లు పంపిణీ చేస్తున్న తెలుగురైతు జిల్లా కార్యదర్శి మద్దాలి సాయిబాబు, ఏవో ఉషారాణి

విద్యుత్ వైర్ల దొంగలు అరెస్టు

కంకిపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వివిధ గ్రామాల్లోని వెంచర్లలో విద్యుత్ వైర్లు దొంగతనం చేస్తున్న పలువురు వ్యక్తులను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు కంకిపాడు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జె. మురళీకృష్ణ చెప్పారు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఆదివారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని జగన్నాథపురం, కొణతనపాడు, ప్రొద్దుటూరు, దావులూరు గ్రామాల్లో ఖాళీగా ఉన్న వెంచర్లలో వేసిన విద్యుత్ వైర్లను గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం పెనుమాకకు చెందిన గరికే చందు, పాలపర్తి నాగరాజుతో పాటు పరారీలో ఉన్న గరికే నాగరాజు, కుంటిగుర్ల నరసింహరాజుతో కలిసి ఈ దొంగతనానికి పాల్పడ్డారు. గరికే చందు ఉల్లిపాయలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుండేవాడు. మద్యం, పేకాటకు బానిసై దొంగతనాలకు అలవాటు పడ్డాడు. మిగిలిన వారితో కలిసి మండలంలోని వివిధ గ్రామాల్లో ఖాళీగా ఉన్న వెంచర్లను ఉదయం రెక్కీ నిర్వహించేవారు. రాత్రి ఎవరూ లేని సమయంలో దొంగతనాలకు పాల్పడేవారు. వెంచర్ల నిర్వాహకులు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి, ప్రత్యేక బృందంగా ఏర్పడి నిందితుల కోసం గాలించామన్నారు. కేసు చేధించటంలో శ్రమించిన ఎస్సై డి.సందీప్, పిఎస్ఐ ఎస్.సురేష్, హెడ్ కానిస్టేబుల్ కె. చంద్రబాబు, కానిస్టేబుల్ మూర్తి, బాజి బాబులను ఆయన అభినందించారు.



ఆముదాలపల్లిలో జయప్రసాదరావు సంస్మరణసభలో పాల్గొన్న ప్రభుత్వ విప్ యార్లగడ్డ వెంకట్రావు, మాజీ ఎమ్మెల్యే దాసరి బాలవర్ధనరావు

దాసరి జయప్రసాదరావు మృతి టీడీపీకి తీరనిలోటు

● ప్రభుత్వవిప్ యార్లగడ్డ వెంకట్రావు

ఉంగుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆముదాలపల్లికి చెందిన దాసరి జయప్రసాదరావు (82)మరణం తెలుగుదేశం పార్టీకి తీరని లోటని ప్రభుత్వవిప్, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు అన్నారు. టీడీపీ నాయకులు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు దాసరి జయప్రసాదరావు సంస్మరణ కార్యక్రమం ఆదివారం మండలంలోని ఆముదాలపల్లిలో జరిగింది. ఈకార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్యే యార్లగడ్డ, జయప్రసాద్‌రావు చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఈసందర్భంగా యార్లగడ్డ మాట్లాడుతూ పార్టీకోసం అంకితభావంతో, నిబద్ధతో పనిచేసిన ప్రసాద్‌రావు పార్టీ పటిష్టతకు ఎనలేని కృషిచేశారన్నారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని అందరూ పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రసాద్‌రావు కుటుంబసభ్యులను పరామర్శించి తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈకార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకటబాలవర్ధనరావు, టీడీపీ మండల అధ్యక్షులు కొలుసు రవీంద్రబాబు, నాయకులు దాసరి రంగారావు, పోతినేని రామకృష్ణ, దాసరి వెంకటబాపినీడు పాల్గొన్నారు.



కాపు వనసమారాధన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొండా ఉమా

విద్యతో అన్ని రంగాల్లో అభివృద్ధి

హనుమాన్‌జంక్షన్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యతో అన్ని రంగాల్లోనూ అభివృద్ధి చెందే అవకాశం ఉందని ప్రతి ఒక్క తల్లిదండ్రులు తమ పిల్లల్ని విద్యావంతుల్ని చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక విజయవాడ రోడ్డులో 4వ హనుమాన్‌జంక్షన్ కాపు వన సమారాధన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విజయవాడ చరిత్రలో కాపు కులం నుంచి ఎమ్మెల్యేగా స్థానం సంపాదించిన వారిలో తాను మూడవ వాడనన్నారు. వంగవీటి రంగా, వంగవీటి రాధా తరువాత మూడవ వ్యక్తిగా ఎమ్మెల్యేగా తనకు అవకాశం వచ్చిందన్నారు. సీనియర్ వైసీపీ నేత దుట్టా రామచంద్రరావు మాట్లాడుతూ కాపు సంఘానికి విద్యానిధిని ఏర్పాటుచేసి దానిని పేద విద్యార్థుల అవసరాలకు వినియోగించాలని సూచించారు. తన వంతు సాయంగా విద్యానిధికి రూ.లక్ష విరాళం అందజేస్తానని ప్రకటించారు. మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను మాట్లాడుతు రాష్ట్ర జనాభాలో 22 శాతంగా ఉన్న కాపు వర్గాలు ఇతర కులాలకు తోడ్పాటుఇచ్చే విధంగా ఉండడం కాదని మనకు మనమే పరస్పర సహకారం అందించుకునే విధంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, చలమలశెట్టి రమేష్ బాబు, మారుబోయిన కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రగ్బీ జాతీయ పోటీలకు స్వప్నకుమారి

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వీరపనేనిగూడెం జడ్పీహైస్కూల్ విద్యార్థినీ చింతల స్వప్నకుమారి రగ్బీ పోటీలలో ప్రతిభ చాటి జాతీయ పోటీలకు ఎంపికయ్యింది. ఈ నెల 28, 29 తేదీల్లో నెల్లూరు జిల్లా పొదలకూరులో జరిగిన స్కూల్ గేమ్స్ అండర్-17 బాలికల రగ్బీ పోటీలలో ప్రతిభ కనబరిచింది. డిసెంబరు 2వ వారంలో భువనేశ్వర్లో జరగనున్న జాతీయ స్థాయి స్కూల్ గేమ్స్ అండర్-17 రగ్బీ పోటీలకు ఎంపికయ్యినట్లు హెచ్‌ఎం జి.వెంకటేశ్వరరావు ఆదివారం తెలిపారు. స్వప్న కుమారికి శిక్షణ ఇచ్చిన పీడీ సీహెచ్ బాలకృష్ణను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు.



చింతల స్వప్నకుమారిని అభినందిస్తున్న పీడీ బాలకృష్ణ

భూ సేకరణ చేసిన స్థలాల్లో గోడౌన్ల నిర్మాణాలు

● ఉదాసీనంగా వ్యవహరిస్తున్న అధికారులు

● ఇలా అయితే భవిష్యత్తులో ఇబ్బందులే

(విజయవాడ రూరల్-ఆంధ్రజ్యోతి): రోడ్లు, బ్రిడ్జ్‌లు వంటి ఏదైనా భారీ నిర్మాణాల సమయంలో ప్రభుత్వ అవసరాలకు భూసేకరణ జరపాలంటే అది పెద్ద సవాలే. ఎన్నో వ్యయ ప్రయాసల పడి భూ సేకరణ జరిపి ప్రభుత్వం అభివృద్ధి పనులు చేపడుతుంది. అలాగే సేకరించిన భూమిని కాపాడుకోవాల్సిన బాధ్యత కూడా ప్రభుత్వ యంత్రాంగంపై ఉంది. అయితే పశ్చిమ బైపాస్ నిర్మాణం కోసం వందలాది ఎకరాలు సేకరించిన ఎన్‌హెచ్ అధికారులు రోడ్డు నిర్మాణం జరపగా మిగిలిన భూములను గాలికి వదిలేశారు. అధికారుల నిర్లక్ష్యం పుణ్యమాని నేడు మిగులు భూములు అన్యాక్రాంతం అవుతున్నాయి. సదరు భూముల్లో నేడు కమర్షియల్ కాంప్లెక్స్‌లు, గౌడౌన్ల నిర్మాణాలు జరుగుతున్నాయి. ప్రధానంగా పశ్చిమ బైపాస్ నిర్మాణం జరిగిన నున్న, పాతపాడు, అంబాపురం తదితర ప్రాంతాల్లో సర్వీస్ రోడ్ల వెంబడి నాలుగు రోడ్ల కూడళ్లలో ప్రభుత్వం సేకరించిన భూములు ఆక్రమణలకు గురౌతున్నాయి. ఆయా స్థలాల్లో యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. నున్న గ్రామ సమీపంలో నూజివీడు రహదారి, పశ్చిమ బైపాస్‌లకు అనుసంధానంగా ఉన్న బ్రిడ్జ్ దిగువన ఇరుపక్కలా ప్రభుత్వం సేకరించిన భూముల్లో కొందరు గోడౌన్‌ల నిర్మాణం చేపడుతున్నారు. సదరు గోడౌన్‌లను భారీ మొత్తానికి లీజులకు ఇచ్చేందుకు కూడా బేరసారాలు జరుగుతున్నాయి. భూసేకరణ సమయంలో పరిహారం పొందిన వ్యక్తులు కూడా తిరిగి మళ్ళీ అదే భూముల్లో భారీ నిర్మాణాలు చేపడుతుండడంపై విమర్శలు వినిపిస్తున్నాయి. ఇంత బహిరంగంగా నిర్మాణాలు జరుపుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వస్తున్నాయి.



నున్న గ్రామం వద్ద పశ్చిమ బైపాస్‌కు ఎడమ పక్క ప్రభుత్వ స్థలంలో నిర్మాణం

భవిష్యత్తులో ఇబ్బందులే

ప్రభుత్వ అవసరాలకు ఉపయోగపడాల్సిన భూములు అన్యాక్రాంతమై గోడౌన్‌లుగా అవతరిస్తుండడంతో భవిష్యత్తులో ఇబ్బందులు తలెత్తే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ముందు ముందు రోడ్ల విస్తరణ జరపాల్సివస్తే మళ్ళీ భూసేకరణకు ప్రభుత్వాలకు తలకు మించిన పనిగా తయారౌతుంది. కోట్లాది రూపాయల విలువ చేసే భూములు ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పడకుండా చూడాలని పలువురు అధికారులను కోరుతున్నారు.



పోరంకిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

సీసీ రోడ్డు ప్రారంభం

పెనమలూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అభివృద్ధి పనులు ప్రణాళికాబద్ధంగా చేస్తున్నామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. తాడిగడప మున్సిపాలిటీ పరిధి పోరంకిలో రూ. 30.40 లక్షల సాధారణ నిధులతో నేతాజీ వీధి మెయిన్ రోడ్డులో నిర్మించిన సీసీ రోడ్డును ఆదివారం ప్రారంభించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గ్రామాలలో సీసీ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యతనిచ్చి పనులు చేశామన్నారు. అభివృద్ధి, సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. పలువురు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

పారిశుధ్యం మెరుగుదలపై రాజీ పడొద్దు

● మండల సమావేశంలో ఎంపీపీ వి.సరోజిని

ఉంగుటూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యాన్ని మెరుగుపరచడం ద్వారా ప్రజారోగ్యాన్ని కాపాడటంలో రాజీ పడవద్దని, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో కలిసి పనిచేసి మండలాభివృద్ధికి తోడ్పడాలని ఎంపీపీ వడ్లమూడి సరోజిని అన్నారు. మండలపరిషత్ సాధారణ సర్వసభ్యసమావేశం ఆదివారం ఉంగుటూరు మండలపరిషత్ కార్యాలయం మీటింగ్ హాలులో ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ప్రభుత్వపథకాల అమలు, ప్రభుత్వ నిధులతో గ్రామాల్లో చేపట్టిన పనుల పురోగతి, ప్రజా సంక్షేమానికి అందిస్తున్న సేవలపై ఎంపీపీ శాఖల వారీగా సమీక్షించారు. ఈసందర్భంగా గ్రామ పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సభలో లేవనెత్తి అధికారులను నిలదీశారు. ఈకార్యక్రమంలో ఎంపీడీవో ఇ.సత్యకుమార్, డిప్యూటీ ఎంపీడీవో జేవీఎస్ఆర్‌కే ప్రసాద్, ఈవోపీఆర్డీ వి.దిలీప్‌కుమార్, ఎంఈవో-2 జె.సాంబశివరావు, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వి.సరోజిని

దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలి

గన్నవరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం దివ్యాంగుల సమస్యలు పరిష్కరించాలని గన్నవరం దివ్యాంగుల సాధికార సంక్షేమ సంఘం డిమాండ్ చేసింది. మండలంలోని తెంపల్లి గ్రామంలో ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. పఠాన్ మస్తాన్, నియోజకవర్గ అధ్యక్షుడు భూదాటి శ్రీనివాసరావును సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ దివ్యాంగులకు ప్రభుత్వ పరంగా మంజూరు కావాల్సిన సంక్షేమ, ఆర్థిక పథకాలు పారదర్శకంగా మంజూరు చేయాలన్నారు. దివ్యాంగులు ఐక్యంగా ఉద్యోగాలు, రుణాలు సాధించుకోవాలన్నారు. దీనికి నియోజకవర్గ సాధికార సంక్షేమ సంఘం కృషి చేస్తుందన్నారు. సంఘం నాయకులు కలపాల రాజశేఖర్, సీహెచ్ కరుణాకర్, కొలుసు వీరభద్రరావు, అంకాలు, అనిల్ కుమార్ పాల్గొన్నారు.




బహుమతులు సాధించిన వారిని అభినందిస్తున్న సంఘ నాయకులు

సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతాలు

హనుమాన్‌జంక్షన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక నూజివీడు రోడ్డులోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ఆది వారం సామూహిక వేంకటేశ్వరస్వామి వ్రతం వేడుకగా నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు ట్రస్టీ కాకాని వెంకటేశ్వరరావు,అరుణ దంపతులు పూజా సామగ్రి ఉచితంగా అందజేశారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని భక్తి శ్రద్ధలతో వ్రతం ఆచరించారు.

జేఈఈ మెయిన్ ఫిజిక్స్ ప్రిపరేషన్

కాన్సెప్ట్ తెలిస్తే కష్టం కాదు



టెన్త్, ఇంటర్ వంటి అకడమిక్ పరీక్షలకు, కాంపిటేటివ్ ఎగ్జామ్స్‌కు తేడా ఉంది. అకడమిక్ పరీక్షల్లో మంచి మార్కుల కోసం పాఠ్య పుస్తకాల్లోని విజ్ఞానం సరిపోతుంది. అదే పోటీపరీక్షలకు లోతుగా అధ్యయనం చేయాలి. సిలబస్‌కు అనుగుణంగా ప్రిపేర్ కావాలి. మోడల్ పేపర్స్ సాధన చేయాలి. మాక్ టెస్టులకు హాజరుకావాలి. అలాగే ప్రతి మార్కు మంచి ర్యాంకు సాధనలో కీలకమే. ఈ నేపథ్యంలో జేఈఈ మెయిన్‌లో ఫిజిక్స్‌కు ఎలా ప్రిపేరైతే మంచిదో పరిశీలిద్దాం.

సబ్జెక్టు పరిజ్ఞానానికి తోడు ప్రాబ్లెమ్ సాల్వింగ్ స్కిల్స్ తెలియాలి. అందుకోసం క్లిష్టమైన వాటిని విశ్లేషించే సామర్థ్యాన్ని అలవర్చుకోవాలి.

- మొదట సబ్జెక్టుపై సిలబస్‌కు అనుగుణంగా సంపూర్ణ అవగాహన కలుగజేసుకోవాలి. తదుపరి రెగ్యులర్ ప్రాక్టీస్‌తో సబ్జెక్టుపై పట్టు లభిస్తుంది.
- వారాంతంలో జరిగే పరీక్షల్లో మార్కులు తక్కువ వచ్చినప్పటికీ ఇబ్బంది పడాల్సిందేమీ లేదు. ఫెయిల్యూర్‌ను సక్సెస్‌కు తొలిమెట్టుగా భావించాలి. అసలా ప్రశ్నను ఎలా అర్థం చేసుకున్నాం, సమాధానాన్ని కనుగొనే క్రమంలో ఎక్కడ తప్పు దొర్లింది అన్నది తెలుసుకుని, సరైన పద్ధతిలో దాన్ని నేర్చుకోవాలి. ఆ తప్పు పునరావృతం కాకుండా చూసుకోవాలి.
- ఒక సమస్యకు పరిష్కారం కనుగొనే పద్ధతిలో వేగమే కాదు, కచ్చితత్వానికీ ప్రాధాన్యం ఇవ్వాలి.

మార్కుల స్కోర్ పెంపు కోసం

- గడచిన ప్రశ్నపత్రాలను విశ్లేషించుకుంటే కొన్ని చాప్టర్లకే ప్రాధాన్యం ఇస్తున్నట్టు అర్థమవుతుంది. 75 శాతం ప్రశ్నలు 25శాతం చాప్టర్ల నుంచే వస్తున్నాయి. 25 ప్రశ్నలకు అంటే అందులో కనీసం 15 కి సమాధానాలు సరిగ్గా గుర్తించగలిగితే చాలు, సీటు గ్యారంటీ వస్తుంది.
- చాప్టర్ల వారీగా అవి... ప్రశ్నల లెక్కన మోడ్రన్ ఫిజిక్స్(4), కరెంట్ ఎలక్ట్రిసిటీ(3), ఎలక్ట్రోస్టాటిక్స్(2), రే ఆప్టిక్స్(2), మెకానిక్స్(5), వేవ్స్(3), థర్మోడైనమిక్స్(2)

ఎలా చదవాలంటే?

- డిసెంబర్ నెలంతా రోజుకు ఒక చాప్టర్ చొప్పున సబ్జెక్టు అంతా చదవాలి.
- డివైడ్ అండ్ కాంకర్ అంటే చాప్టర్‌ను అయిదారు భాగాలుగా విభజించుకుని పట్టు సాధించాలి.
- కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునేందుకు షార్ట్ నోట్స్‌ని ఉపయోగించాలి. ప్రాబ్లెమ్‌ని సాల్వ్ చేసే పద్ధతిలో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకునే పద్ధతిని తెలుసుకోవాలి.
- ప్రతి రోజూ పది నుంచి ఇరవై ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేయాలి. ఎక్కడైనా తప్పు దొర్లితే దాన్ని కనీసం అయిదారు సార్లు ప్రాక్టీస్ చేయాలి.
- ప్రతి అదివారం ఫుల్ సిలబస్‌పై ఒక మోడల్ టెస్ట్ ప్రాక్టీస్ చేయాలి.
- నెగెటివ్ మార్కులు రాకుండా జాగ్రత్త పడాలి. టైమ్ మేనేజ్‌మెంట్ ముఖ్యం. ర్యాండమ్ వీడియోలు చూసి టైమ్ వృథా చేసుకోవద్దు.
- ప్రిపరేషన్ మొదటి రోజు నుంచి మార్కులు అని కాకుండా సబ్జెక్టుపై దృష్టి పెట్టడం మంచిది.
- సీటు తెచ్చుకోవడం ఎంత మాత్రం మేజిక్ లేదంటే లక్ కాదని విద్యార్థులు గ్రహించాలి. ఎంతో కృషి ఉంటేనే అనుకున్న సీటు లభిస్తుందని తెలుసుకోవాలి.

రెండు రకాలు

- మొదటిది కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవడం. అందుకు ఎన్‌సీఈఆర్‌టి పుస్తకాలతో సొంత నోట్స్‌ను రూపొందించుకోవాలి.
- కాన్సెప్ట్‌ను నేర్చుకునేందుకు థియరీ ఓరియెంటెడ్ మెటీరియల్ చాలు. రేఖా చిత్రాలు, చార్టులు, టేబుల్స్‌తో కాన్సెప్ట్‌ను అర్థం చేసుకోవాలి.
- ప్రతి చాప్టర్‌పై ఒకట్రెండు పేజీల మేర షార్ట్ నోట్స్‌ను తయారు చేసుకోవాలి.
- కాన్సెప్ట్‌ను గుర్తుంచుకోవడంలో విజువలైజేషన్ టెక్నిక్స్, టిప్స్ సహాయపడతాయి.
- ఫార్ములా లేదా చార్టులను గుర్తుంచుకోవడంలో న్యూమానిక్స్(జ్ఞప్తికి తెచ్చుకోవడం) కీలకం. ఉదాహరణకు ఇఎండబ్ల్యు చాప్టర్‌లో ఎప్పుడూ ఒక ప్రశ్న వస్తుంది. చాలా సార్లు ఈ ప్రశ్న ఇఎండబ్ల్యుకు సంబంధించిన వేవ్‌లెంథ్/ ఫ్రీక్వెన్సీ శక్తి ఆర్డర్‌పైన ఉంటుంది. ఉదాహరణకు - రేడియో వేవ్స్ - మైక్రో వేవ్స్ - ఇన్‌ఫ్రారెడ్ రేస్ - విజిబుల్ రేస్ - అల్ట్రావయలెట్ రేస్ - ఎక్స్ రేస్ - గామా(ఆర్) రేస్ - కాస్మిక్ రేస్

దీనిని గుర్తుంచుకునేందుకు..... రెడ్ మార్షియన్స్ ఇన్వేడెడ్ వీనస్ యూజింగ్ ఎక్స్‌రే గన్ లేదా మా ఇంటికి వచ్చి ఉండు ఇష్టం లేకపోతే రాకు అన్న పద్ధతి ఉపయోగించాలి.

- ఇదే విధంగా రేడియో యాక్టివ్ సిరీస్ ఆర్డర్‌ను గుర్తుంచుకోవచ్చు. థోరియం సిరీస్(4ఎన్), నెప్ట్యూనియమ్ సిరీస్(4ఎన్+1), యురేనియమ్ సిరీస్(4ఎన్+2), యాక్టీనియం సిరీస్(4ఎన్+3). దీని కోసం సినిమా రంగం ఆంధ్రలోకి ఎలా వచ్చిందో చెబితే సరిపోతుంది. తమిళనాడు(టిఎన్) ఉత్తర అంధ్ర(యుఎ) - రివర్స్‌లో అంటే - ఎయుఎన్‌టి అని గుర్తుంచుకోవచ్చు.
- రెండోది ప్రాబ్లమ్ సాల్వింగ్ స్కిల్. ప్రాబ్లెమ్‌ను పూర్తిగా చదవాలి. దానికి సంబంధించిన ఫార్ములా ఉపయోగించాలి. రోజుకు ఒకటి రెండు గంటలు న్యూమరికల్స్ ప్రాక్టీస్ చేయాలి. గడచిన అయిదేళ్ళ ప్రశ్నపత్రాలను సాల్వ్ చేస్తే సంపూర్ణ అవగాహన కలిగించుకోవచ్చు.

డాక్టర్ కిషన్‌రావ్ టంకశాల,
బన్సాల్ క్లాసెస్, హిమయతనగర్, హైదరాబాద్

దిక్సూచి

మ్యాట్

దేశంలోని బిజినెస్ స్కూళ్లలో ప్రవేశానికి ఉద్దేశించిన పరీక్షల్లో మేనేజ్‌మెంట్ ఆప్టిట్యూడ్ టెస్ట్(మ్యాట్) ఒకటి. ఆలిండియా మేనేజ్‌మెంట్ అసోసియేషన్(ఏఐఎంఏ) దీన్ని ఏటా నాలుగుసార్లు నిర్వహిస్తుంది. ప్రస్తుతం డిసెంబర్‌లో నిర్వహించే పరీక్షకు ప్రకటన ఇచ్చింది. డిగ్రీ ఉత్తీర్ణులకు తోడు కోర్సు చివరి ఏడాది చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

- పేపర్ బేస్డ్ టెస్ట్(పీబీటీ), కంప్యూటర్ బేస్డ్ టెస్ట్(సీబీటీ) అలాగే పీబీటీ+సీబీటీగా అంటే మూడు రకాలుగా ఈ టెస్ట్‌ను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లోని కాలేజీలకు తోడు దేశవ్యాప్తంగా అరువందలకు పైగా సంస్థల్లో ప్రవేశానికి ఈ స్కోర్ ఉపయోగపడుతుంది. అలాగే ఇందులో సాధించిన స్కోర్ ఏడాది పాటు చెల్లుతుంది.
- రెండు గంటల వ్యవధికలిగిన ఈ పరీక్షలో అయిదు విభాగాల నుంచి 150 ప్రశ్నలు అడుగుతారు. లాంగ్వేజ్ కాంప్రహెన్షన్, ఇంటెలిజెన్స్ అండ్ క్రిటికల్ రీజనింగ్, మేథమెటికల్ స్కిల్స్ డేటా అనాలిసిస్ అండ్ సఫిసియెన్సీ, ఎకనామిక్ అండ్ బిజినెస్ ఎన్విరాన్‌మెంట్ అంశాల్లో ప్రశ్నలు ఉంటాయి. సమాధానాన్ని కరెక్ట్‌గా గుర్తిస్తే ఒక మార్కు ఇస్తారు. తప్పుగా గుర్తిస్తే పావు మార్కు తగ్గిస్తారు. వెబ్‌సైట్‌లో మాదిరి ప్రశ్నలు ఉన్నాయి. ఇటు క్యాట్, అటు ఐసెట్‌కు మధ్యస్థంగా మ్యాట్ ఉంటుంది.
- **పీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 7
- **సీబీటీ రిజిస్ట్రేషన్‌కు చివరి తేదీ:** డిసెంబర్ 15
- **పేపర్ ఆధారిత పరీక్ష తేదీ:** డిసెంబర్ 13
- **కంప్యూటర్ ఆధారిత పరీక్ష:** డిసెంబర్ 21
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** పేపర్ ఆదారిత - హైదరాబాద్, విశాఖపట్టణం; కంప్యూటర్ ఆదారిత - హైదరాబాద్, విజయవాడ
- **వెబ్‌సైట్:** https://mat.aima.in



మేనేజ్‌లో పీజీ డిప్లొమా

హైదరాబాద్‌లోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఎక్స్‌టెన్షన్ మేనేజ్‌మెంట్(మేనేజ్) 2026-28 విద్యాసంవత్సరానికి సంబంధించి పీజీడీఎం(అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్) కోర్సులో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. అగ్రికల్చర్ సంబంధ కోర్సులో డిగ్రీ ఉత్తీర్ణులు ఈ కోర్సు చేసేందుకు అర్హులు. 2025 క్యాట్ స్కోర్, గ్రూప్ డిస్కషన్, ఎస్సే రైటింగ్, అకడమిక్ రికార్డ్, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపిక ఉంటుంది. ఆసక్తి ఉన్న అభ్యర్థులు వచ్చే ఏడాది ఫిబ్రవరి 10లోగా దరఖాస్తు చేసుకోవాలి.

వెబ్‌సైట్: www.manage.gov.in/ABMAdmissions/appln.pdf

జాబ్ కార్నర్

బీడీఎల్‌లో మేనేజ్‌మెంట్ ట్రైనీలు

హైదరాబాద్‌లోని భారత్ డైనమిక్స్ లిమిటెడ్(బీడీఎల్) 80 మేనేజ్‌మెంట్ ట్రైనీ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.

విభాగాలు: ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఎలక్ట్రికల్, కంప్యూటర్ సైన్స్, మెటలర్జీ, కెమికల్, సివిల్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగాలో 55 నుంచి 60 శాతం మార్కులతో డిగ్రీ/ పీజీ - డిప్లొమా, సీఏ/ ఐసీడబ్ల్యుఏఐ పాసై ఉండాలి.

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు: డిసెంబర్ 3 నుంచి 29 వరకు

వెబ్‌సైట్: https://bdl-india.in

भारत डायनामिक्स लिमिटेड
BHARAT DYNAMICS LIMITED

అప్రెంటిస్‌షిప్

బీడీఎల్ - కంచన్‌బాగ్ యూనిట్‌లో 156 ట్రేడ్ అప్రెంటిస్‌షిప్ ఖాళీలు ఉన్నాయి.

ట్రేడ్‌లు: ఫిట్టర్ 70, ఎలక్ట్రీషియన్ 10, ఎలక్ట్రానిక్స్ మెకానిక్ 30, మెషినిస్ట్ 15, మెషినిస్ట్ గ్రైండర్ 2, మెకానికల్ డీజిల్ 5, మెకానిక్ ఆర్ అండ్ ఏసీ 5, టర్నర్ 15, వెల్డర్ 4

అర్హత: టెన్త్‌తో పాటు సంబంధిత ట్రేడ్‌లో అభ్యర్థి ఉత్తీర్ణులై ఉండాలి.

వయస్సు: డిసెంబర్ 8 నాటికి వయస్సు 14-30 సంవత్సరాల మధ్య వయస్సు ఉండాలి.

ఎంపిక: విద్యార్హతలు, రిజర్వేషన్ నిబంధనల అధారంగా

దరఖాస్తు: అప్రెంటిస్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్‌కు డిసెంబర్ 8(హార్డ్ కాపీలు పంపేందుకు డిసెంబర్ 12)

వెబ్‌సైట్: www.apprenticeshipindia.gov.in

బ్యాంక్ ఆఫ్ బరోడాలో మేనేజర్లు

బ్యాంక్ అఫ్ బరోడా 82 మేనేజర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది

పోస్టులు: జోనల్ రిసీవబుల్ మేనేజర్ 13, రీజినల్ రిసీవబుల్ మేనేజర్ 13, ఏరియా రిసీవబుల్ మేనేజర్ 49, కంప్లయన్స్ మేనేజర్ 1, కంప్లయింట్ మేనేజర్ 1, ప్రాసెస్ మేనేజర్ 1, వెండర్ మేనేజర్ 1, ఫ్లోర్ మేనేజర్ 3

అర్హత: గుర్తింపు పొందిన యూనివ్సిటీ నుంచి డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి

ఎంపిక: ఇంటర్వ్యూ ఆధారంగా

ఆన్‌లైన్‌లో దరఖాస్తుకు ఆఖరు తేదీ: డిసెంబర్ 9

వెబ్‌సైట్: www.bankofbaroda.bank.in


చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

మాస్ సాంగ్‌కు చిరు.. వెంకీ స్టెప్స్



చిరంజీవి కథానాయకుడిగా అనిల్ రావిపూడి తెరకెక్కిస్తున్న 'మన శంకర వరప్రసాద్ గారు' షూటింగ్ శరవేగంగా సాగుతోంది. హీరో వెంకటేశ్ ఈ చిత్రంలో ఓ ప్రత్యేక పాత్రలో కనిపించనున్నారు. తాజాగా ఈ సినిమా గురించి ఓ ఆసక్తికరమైన అప్డేట్ ఇచ్చారు మేకర్స్. ఈ అగ్రహీరోలిద్దరూ సినిమాలో ఓ గీతానికి కాలు కదపనున్నట్లు తెలిపారు. ఈ క్రమంలోనే ఓ అదిరిపోయే మాస్ గీతాన్ని భారీ సెట్ వేసి షూట్ చేస్తున్నారు. దాదాపు 500 మంది డ్యాన్సర్లతో కలర్‌ఫుల్‌గా ఈ పాటను చిత్రీకరిస్తున్నారు. విజయ్ పోలకి ఈ పాటకు కొరియోగ్రఫీ చేస్తున్నారు. ఈ మాస్ గీతం వచ్చే ఏడాది విడుదలయ్యే ఉత్తమ పాటల్లో ఒకటిగా నిలిచిపోతుంది, వీరిద్దరి ఎనర్జీ, స్టైల్ ప్రేక్షకులకు అద్భుతమైన వినోదం అందించనుందని మేకర్స్ చెప్పారు. వచ్చే ఏడాది సంక్రాంతికి ఈ చిత్రం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్, గోల్డ్ బాక్స్ ఎంటర్టైన్‌మెంట్స్ బేనర్‌పై సాహు గారపాటి, చిరంజీవి కుమార్తె సుస్మిత కొణిదెల నిర్మిస్తున్నారు. నయనతార కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటర్: తిమ్మరాజు, సినిమాటోగ్రఫీ: సమీర్ రెడ్డి, సంగీతం: భీమ్స్ సిసిరోలియో.



మలయాళ కథానాయకుడు దుల్కర్ సల్మాన్ 'ఐ యామ్ గేమ్' అనే కొత్త సినిమాతో అలరించబోతున్నారు. నహాస్ హిదాయత్ దర్శకత్వం వహిస్తోన్న ఈ చిత్రాన్ని దుల్కర్ సల్మాన్, జోమ్ వర్గీస్ నిర్మిస్తున్నారు. మేకర్స్ ఆదివారం ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని విడుదల చేశారు. నైట్ క్లబ్, క్యాసినో బ్యాక్‌డ్రాప్‌లో స్టయిలిష్ సూట్ వేసుకున్న దుల్కర్ రక్తం తడిసిన చేతితో గన్ పట్టుకుని ఇంటెన్స్ లుక్‌లో కనిపించడం అదిరిపోయింది. మిస్కిన్, ఆంటోని వర్గీస్, సంయుక్త విశ్వనాథన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు.

అఖండ నుంచి అవతార్ వరకూ...

● డిసెంబర్‌లో బాక్సాఫీస్ వార్



ప్రతి ఏటా సంక్రాంతి వస్తుందంటే చాలు, సినిమా ప్రేమికులకు పండగే. కానీ ఈ సారి డిసెంబర్ మాత్రం మామూలుగా లేదు. బాక్సాఫీసు రికార్డులు బద్దలుకొట్టేందుకు పాన్ ఇండియా స్టార్ల నుంచి హాలీవుడ్ దిగ్గజాల వరకూ అందరూ క్యూ కట్టారు. నందమూరి బాలకృష్ణ 'అఖండ 2' గర్జనతో మొదలై, జేమ్స్ కామెరాన్ సృష్టించబోయే విజువల్ వండర్ వరకూ... ఈ ఏడాది ముగింపు బాక్సాఫీసు దగ్గర వేడి పుట్టించనుంది.

మొదటి వారమే మాస్ జాతర

డిసెంబర్ నెల ఆరంభమే అదిరిపోయే రేంజ్‌లో ఉండబోతోంది. 'అఖండ'లో అఘోరాగా విశ్వరూపం చూపారు బాలకృష్ణ. ఆ చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కిన 'అఖండ 2' డిసెంబర్ 5న థియేటర్లలో విడుదలకు దిగుతోంది. అదే రోజు బాలీవుడ్ హీరో రణ్‌వీర్‌సింగ్ 'ధురంధర్', మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి నటించిన 'కలంకావల్' చిత్రాలు విడుదలవుతున్నాయి.

- రెండో వారంలో 'అన్నగారు వస్తారు' అంటూ కార్తీ సందడి చేయనున్నారు. దీంతోపాటు 'మోగ్లీ, సైక్ సిద్దార్థ్' చిత్రాలు కూడా డిసెంబర్ 12నే విడుదలవుతున్నాయి.
- ప్రపంచవ్యాప్తంగా ఉన్న సినీ ప్రేమికులంతా ఆసక్తిగా ఎదురుచూస్తున్న తేదీ డిసెంబర్ 19. జేమ్స్ కామెరాన్ తెరకెక్కించిన దృశ్యకావ్యం 'అవతార్ 3' వెండితెరపై అద్భుతాలు సృష్టించేందుకు సిద్ధంగా ఉంది. దీనికి ఒక రోజు ముందు ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' చిత్రం విడుదలవుతోంది.

క్రిస్మస్ కిటకిట: సంక్రాంతిని తలపించేలా క్రిస్మస్ రోజునా బాక్సాఫీసు దగ్గర పలు చిత్రాలు వరుస కడుతున్నాయి. డిసెంబర్ 25న ఏకంగా ఏడు సినిమాలు విడుదలవుతున్నాయి. మోహన్‌లాల్ 'వృషభ, హాలీవుడ్ మూవీ 'అనకొండ, గుణశేఖర్ దర్శకత్వంలో తెరకెక్కిన యూత్‌ఫుల్ డ్రామా 'యుఫోరియా', రోషన్ మేకా హీరోగా నటించిన క్రీడా నేపథ్య చిత్రం 'ఛాంపియన్'తో పాటు 'శంబల, దండోరా, పతంగ్ చిత్రాలు ఒకే రోజు ప్రేక్షకుల ముందుకొస్తున్నాయి. డిసెంబర్ బరిలో నిలిచిన చిత్రాలు డజనుకు పైగానే ఉన్నాయి. మరి వీటిలో ఎన్ని చిత్రాలను విజయం వరిస్తుందో వేచి చూడాలి.

లెజెండ్‌తో నటించడం నా అదృష్టం

హర్షాలి మల్హోత్రా



'బాలకృష్ణ గారి లాంటి లెజెండరీ యాక్టర్‌తో కలసి నటించడం నిజంగా నా అదృష్టం. సెట్‌లో ఆయన చిత్ర బృందంతో సరదాగా ఉన్నారు. తెలుగు సినిమాకు కొత్త వ్యక్తిని అయిన నన్ను ఎంతో ప్రోత్సహించారు. బాలకృష్ణగారు వెరీ ఎనర్జిటిక్, అన్‌స్టాపబుల్' అని అన్నారు నటి హర్షాలి మల్హోత్రా. నందమూరి బాలకృష్ణ కథానాయకుడిగా బోయపాటి శ్రీను తెరకెక్కించిన 'అఖండ 2: తాండవం'లో ఆమె కీలక పాత్ర పోషించారు. తేజస్విని నందమూరి సమర్పణలో 14 రీల్స్ బేనర్‌పై రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మించారు. ఈనెల 5న విడుదలవుతున్న సందర్భంగా హర్షాలి మీడియాతో మాట్లాడారు.

- దాదాపు పదేళ్ల తర్వాత మళ్లీ తెరముందుకు వస్తున్నందుకు ఆనందంగా ఉంది. 'బంజరంగీ భాయిజాన్' చిత్రం తర్వాత కొంత గ్యాప్ వచ్చింది. ఈ సమయంలో చదువుపై దృష్టి పెట్టాను. అలాగే కథక్ నృత్యం కూడా నేర్చుకున్నాను. ఒక మంచి పాత్ర కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'అఖండ 2'లో అవకాశం వచ్చింది.
- ఈ చిత్రంలో నేను జననీ అనే పాత్రలో కనిపిస్తాను. జననీ జీవితం ప్రమాదంలో పడినప్పుడల్లా అఖండ వచ్చి రక్షిస్తాడు. ఈ సినిమాలో నేను కొన్ని యాక్షన్ స్టంట్స్ కూడా చేశాను.
- డైరెక్టర్ బోయపాటి గారు 'నువ్వు తప్పకుండా చేయగలవు' అని ఎంతో ప్రోత్సహించేవారు. సన్నివేశం పూర్తయిన తర్వాత 'అద్భుతంగా చేశావ'ని అభినందించేవారు. నాకు సంజయ్ లీలా బన్సాలీ గారి సినిమాలో నటించాలని ఉంది. ఆయన హీరోయిన్లని చూపించే విధానం అద్భుతంగా ఉంటుంది.

కన్నడ హాస్యనటుడు ఉమేశ్ కన్నుమూత



ప్రముఖ కన్నడ హాస్యనటుడు ఉమేశ్ (80) ఆదివారం ఉదయం బెంగళూరులో కన్నుమూశారు. కొన్నాళ్లుగా ఆయన లివర్ క్యాన్సర్‌తో బాధపడుతున్నారు. సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్, కన్నడ సాంస్కృతిక శాఖ మంత్రి శివరాజ్ తంగడిగతోపాటు పలువురు అభిమానులు, సినీ నటులు పెద్దఎత్తున తరలివచ్చి నివాళులు అర్పించారు. ఉమేశ్ 1945 ఏప్రిల్ 22న మైసూరులో జన్మించారు. బాల్యంలోనే ఉమేశ్ పలు సినిమాల్లో నటించారు. కే హిరణ్ణయ్య మిత్రమండలిలో చేరాక పలు నాటకాల్లో భిన్నమైన పాత్రలను పోషించారు. 350 సినిమాఆడల్లో నటించారు. ఆయనకు భార్య ఉష, కుమార్తె ఉన్నారు. ఆదివారం సాయంత్రం బనశంకరి స్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

సందేశాత్మక చిత్రంతో

ప్రస్తుత భారతదేశ, సామాజిక, రాజకీయ ఇతివృత్తంతో ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నట్లు నిర్మాత అతీకూర్ రెహమాన్ తెలిపారు. నూతన నటీనటులతో రూపొందుతున్న ఈ చిత్రం వివరాలను ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన వివరించారు. 'టాలీవుడ్‌లో ఆర్‌ఎక్స్ ఫ్లోర్ మూవీస్ అనే కొత్త బేనర్‌ను ఏర్పాటు చేశాం. వినోద ప్రధానమైన చిత్రాలతో పాటు పలు సామాజిక సమస్యలపై సందేశాత్మకంగా ఉండే చిత్రాలను నిర్మిస్తాం. ఈ నెల్లోనే సినిమాను సెట్స్‌పైకి తీసుకెళ్తాం' అని తెలిపారు.



చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలా?

అదూర్ గోపాలకృష్ణన్



ప్రముఖ మలయాళ సినీ దర్శకుడు, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత అదూర్ గోపాలకృష్ణన్ జాతీయ చలనచిత్ర అవార్డుల ఎంపికపై తీవ్ర విమర్శలు చేశారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... గత కొంతకాలంగా చెత్త సినిమాలకు అత్యున్నత పురస్కారాలు దక్కుతున్నాయని ఆరోపించారు. దీనిపై విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నాసిరకం చిత్రాల ఎంపికకు జ్యూరీ అసమర్థతే ప్రధానకారణం అని ఆరోపిస్తూ, అర్హత కలిగిన జ్యూరీ ఉంటేనే సరైన చిత్రాలకు గౌరవం దక్కుతుందని స్పష్టం చేశారు. నాణ్యమైన సినిమాలను గుర్తించి, ప్రోత్సహించడమే జాతీయ అవార్డుల ఏర్పాటు వెనుక ఉన్న ముఖ్య ఉద్దేశమనీ, కానీ ఇప్పుడు ఆ పరిస్థితి కనిపించడం లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. న్యాయ నిర్ణేతల ప్రమాణాలు తక్కువగా ఉంటే, వారి గుర్తింపు కోసం నాసిరకం చిత్రాలనే పురస్కారాలకు ఎంపిక చేస్తారని ఎద్దేవా చేశారు. ఈ పరిస్థితి ఇలాగే కొనసాగితే జాతీయ పురస్కారాలను ఇవ్వడం మానుకుంటే మంచిదని గోపాలకృష్ణన్ అభిప్రాయపడ్డారు 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో మలయాళ చిత్రం 'ది కేరళ స్టోరీ' కి అవార్డులు రావడంపై గోపాలకృష్ణన్ కొన్నాళ్లుగా పరోక్షంగా విమర్శలు చేస్తున్నారు.

సుకుమార్ చిత్రంలా ఉంటుంది

'సహకుటుంబానాం' నా స్నేహితుడు విక్రమ్ చేయాలనుకున్న సినిమా. కానీ ఆయన చనిపోవడంతో ఆ కథ లైన్‌ను తీసుకుని ఉదయ్ చేశాడని తెలిసి ఎంతో సంతోషించా. ఈ చిత్రం సుకుమార్ గారి ఆలోచన లాగా ఉంటుంది. అందర్నీ ఆకట్టుకుంటుంది' అని దర్శకుడు బుచ్చిబాబు సానా అన్నారు. రామ్‌కిరణ్, మేఘా ఆకాశ్ జంటగా ఉదయ్ శర్మ తెరకెక్కించిన చిత్రం 'సహకుటుంబానాం'. హెచ్.మహదేవ్ గౌడ్ నిర్మించారు. ఈ చిత్రం ట్రైలర్‌ను బుచ్చిబాబు సానా విడుదల చేసి చిత్రబృందానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ 'ఇటువంటి కథను నా 48 ఏళ్ల కెరీర్‌లో ఎప్పుడూ వినలేదు. చాలా ప్రత్యేకంగా ఉండబోతోంది' అని చెప్పారు. రామ్‌కిరణ్ మాట్లాడుతూ 'అందరి అంచనాలను అందుకునేలా ఈ సినిమా ఉంటుంది. కచ్చితంగా విజయం సాధిస్తుంది' అని తెలిపారు.



బ్రాయిలర్ ధరలు

అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

కొండాలమ్మకు పొంగళ్లు

గుడ్లవల్లేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : వేమవరం కొండాలమ్మ అమ్మవారిని ఆదివారం 10 వేల మంది భక్తులు దర్శించుకున్నారని ఆలయ కార్యనిర్వాహణాధికారి ఆకుల కొండలరావు తెలిపారు. భక్తులు అమ్మవారికి పాలపొంగళు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం గుడ్లవల్లేరు నుంచి కొండాలమ్మ అమ్మవారి ఆలయానికి అయ్యప్ప దీక్షాపరులు, పలువురు భక్తులు కాలినడకన అమ్మవారి ఆలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకున్నారు.


అమ్మ దర్శనం కోసం పాదయాత్ర చేస్తున్న గుడ్లవల్లేరు అయ్యప్పలు


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే వర్లకుమార్‌రాజా

లబ్ధిదారులకు సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు

పామర్రు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో బాధపడే వారికి ఆరోగ్యశ్రీ పథకంలో వర్తించని పేదకుటుంబాలకు సీఎం సహాయనిధి గొప్పవరం అని దాని నుంచి అందిస్తున్న ఆర్థిక చేయూతను అందుకుని ఆరోగ్యవంతులుగా నిలవాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. ఎమ్మెల్యే సిఫార్సులతో పామర్రులో వివిధ వార్డులోగల అనారోగ్య బాధితులైన సమ్మంగి శ్రీనివాసరావు రూ.88,724, పెందుర్తి భువనేశ్వరికు రూ.24,866వేలు, ముగ్నిండి పార్వతికి రూ.42,205 పరస లక్ష్మణరావుకు రూ.37,710 మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం ఎమ్మెల్యే వారి ఇండ్ల వద్దకు వచ్చి అందజేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు మండపాక శంకర్ బాబు, దాలిపర్తి ప్రసాద్, అల్లంశెట్టి సురేష్, చాట్ల రమేష్, సుబ్రమణ్యం, సందీప్, రామంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బాలోత్సవం

గుడివాడ : విద్యార్థులు ఆటపాటలతో పాటు చదువుపై శ్రద్ధ వహించాలని, చదువులో రాణించడానికి ఇటువంటి బాలోత్సవాలు ఎంతగానో దోహదపడుతాయని ఆర్డీవో జి.బాలసుబ్రహ్మణ్యం అన్నారు. స్థానిక మాంటిస్సోరి ఇంగ్లీషు మీడియం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న గుడివాడ బాలోత్సవ వేడుకలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ స్టేడియం కమిటీ ఉపాధ్యక్షుడు యలవర్తి శ్రీనివాసరావు, ఎంఈవో బాలాజీ, ఏఎన్‌ఆర్ కళాశాల కరస్పాండెంట్ కె.ఎస్ అప్పారావు, వీకెఆర్ అండ్ వీఎన్‌బీ ఇంజినీరింగ్ కళాశాల కార్యదర్శి కొదండరామయ్య, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు మాదాల వెంకటేశ్వరరావు, కళాకారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

పెదపారుపూడి: వెంట్రప్రగడకు చెందిన పెదపూడి వెంకటేశ్వరరావు మృతి చెందగా, టీడీపీ నాయకులు నివాళులర్పించారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి పీ4 పథకం ద్వారా రాచూరి ప్రభుదాసు సమకూర్చిన 5 వేలు నగదును పార్టీ నాయకులు కుటుంబసభ్యులకు అందజేశారు. స్థానిక శాసనసభ్యులు వర్ల కుమార్ రాజా ఆదేశాల మేరకు ఆర్థిక సాయమందించినట్లు తెలిపారు. టీడీపీ మండల అధ్యక్షుడు చలసాని రమేష్ చౌదరి, స్థానిక పీఏసీఎస్ అధ్యక్షుడు కూచిపూడి వెంకట సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

చిరుజల్లులతో రైతుల ఆందోళన


రామన్నపూడిలో రోడ్డుపై ఆరబెట్టిన ధాన్యం

గుడివాడ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను హెచ్చరికలతో రైతులు తీవ్ర ఆందోళన చెందటమే కాకుండా పూర్తిగా నష్టపోతామని భయపడుతున్నారు. గతంలో మొంథా తుఫాను వల్ల అపార నష్టం వాటిల్లిందని, ప్రస్తుతం దిత్వా తుఫానుతో తీవ్రంగా నష్టపోతామని వాపోతున్నారు. ధాన్యం రోడ్లపై, గృహాల ముందు, పొలం గట్లపై పరదాలు కప్పి ఉన్నాయి. ముఖ్యంగా లారీల కొరత తీవ్రంగా ఉంది. రైతులు ధాన్యాన్ని నూర్చి వారం, పది రోజులవుతున్నా లారీలు పంపకపోవటంతో చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. గన్నీ సంచుల కొరత ఉంది. తహసీల్దార్, ఆర్డీవోలు సైతం సంచుల కొరత తీర్చటానికి ఎంత ప్రయత్నం చేస్తున్నా కొరత ఎక్కువగా ఉంది. మిషన్ల ద్వారా కోసిన ధాన్యం 29 నుంచి 32 శాతం వరకు తేమ ఉంటుంది. 30 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని మిల్లర్లు కొనుగోలు చేయటానికి ఇష్టపడటం లేదు. గుట్టలుగా పోస్తే ధాన్యం ఆ తడి మీద రంగు మారుతుంది. నాయకులు మాటల వరకే గానీ రైతుల పరిస్థితి పట్టించుకోవటం లేదని రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

పామర్రు : ఆరుగాళం శ్రమించి పండించిన పంటలపై ఎంతో ఆశలు పెట్టుకున్న అన్నదాతల ఆశలపై దిత్వాతుఫాను వారి గుండెల్లో రైళ్ల పరిగెత్తిస్తోంది.. పామర్రులో ఇప్పటికే రైతులు,కౌలుదార్లు వరికోతలను అందుబాటులో ఉన్నా కూలీలతోపాటు, యంత్ర పరికరాలతో యుద్ధ ప్రాతిపాదికన కోతలు,నూర్పిళ్లను గడిచిన వారం రోజుల కిందటే పూర్తిచేశారు. యంత్రాలతో కోతలు కోసిన రైతులకు సరైన మద్దతు ధర లభించదనే అనుమానంతో కూలీలతో ఏకరాకు రూ.3500 నుంచి రూ.6000 వరకు ఖర్చుచేసి కోతలు కోసి పనలు చేలో ఆరబెట్టారు. వాతవరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో కల్లాల్లోని ధాన్యాన్ని ఆఘమేఘాల మీద స్థానిక బేరాగళ్లకు తక్కువధరకు ఇచ్చేందుకు సిద్ధమై తరలిస్తున్నామంటున్నారు. రాజకీయ నేతల సిఫార్సులున్న వారికి అధికారులు పరదాలందిస్తుందనే ఆరోపణలు రైతులనుంచి వినవస్తున్నాయి. యంత్రాలతో కోసిన ధాన్యం తరలింపులో జిల్లా స్థాయి అధికారులు చేస్తున్న ప్రకటనలకు క్షేత్ర స్థాయిలో జరుగుతున్న జాప్యానికి పొంతన ఉండటం లేదని వారు వాపోతున్నారు. కౌలు రైతుల పరిస్థితి చెప్పలేని విధంగా తయారైందంటున్నారు.


పామర్రులో ధాన్యం రాశులను రక్షించుకునేందుకు పరదాలను కప్పుకొంటున్న రైతులు

నందివాడ : తుఫాన్ సందర్భంగా రోడ్లపై పోసుకున్న ధాన్యం వర్షానికి తడిసిపోతాయన్న ఉద్దేశ్యంలో


కూచిపూడిలో హడావిడిగా కుప్పలు వేస్తున్న రైతులు

వర్షంతో ధాన్యం రైతుల విలవిల

కూచిపూడి : తుపాను ప్రభావం కారణంగా ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లులు ప్రారంభం కావటంతో రైతన్నలు ఆందోళన చెందుతున్నారు. ఒక పక్క కాటాలు వేసిన ధాన్యపు బస్తాలు మరొకపక్క రోడ్లపక్కన ఎక్కడ చూసినా ఆరబెట్టిన ధాన్యపు రాశుల నిల్వలు దర్శనమిస్తున్నాయి. కొన్ని గ్రామాల్లో వరి కోతలు కోయగా, తుఫాను హెచ్చరికల నేపథ్యంలో రైతులు హడావిడిగా కుప్పలు వేస్తున్నారు. కూచిపూడి, మొవ్వ, పెదపూడి, కారకంపాడు, చినముత్తేవి, కాజ, కోసూరు తదితర గ్రామాల్లో వరి పంట వివిధ దశల్లో ఉంది. వరుస తుఫానుల ప్రభావం కారణంగా చేతికందివచ్చిన పంటకు తీవ్ర నష్టం కలిగి ఈ ఏడాది పెట్టుబడి ఖర్చులు సైతం గిట్టుబాటయ్యే పరిస్థితులు కనిపించటం లేదని రైతులు వాపోతున్నారు.


వడ్లమన్నాడులో..

శివలింగాల పీఏసీఎస్ అధ్యక్షుడు కొలకలేటి భవానీ ప్రసాద్, మండల తహసీల్దార్ గురుమూర్తి ఆధ్వర్యంలో రైతులకు ఆదివారం పంపిణీ చేసినట్లు తెలిపారు. తాతినేని మురళీ, ఆర్ఐ గణేష్, పాల్గొన్నారు.

గుడ్లవల్లేరు : దిత్వా తుఫాను రైతన్నలను వణికిస్తోంది. ఆదివారం మధ్యాహ్నం నుండి ఓమోస్తరు వర్షం కురవడంతో రైతులు తీవ్ర ఆందోళనకు లోనవుతున్నారు. ఆరుగాలం కష్టించి పండించిన పంట చేతికి వచ్చే సమయంలో దిత్వా తుఫాను రైతుల దిశమార్చేస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎక్కడికక్కడ ధాన్యం రాసులు రోడ్లపైన ఆరబెట్టి ఉన్నాయి.

తోట్లవల్లూరు : తోట్లవల్లూరులో ఆదివారం సాయంత్రం నుంచి దిత్వా తుఫాను ప్రభావంతో వర్షం మొదలయింది. ఒక మాదిరి వర్షం వచ్చి వెలవటం కొంత ఉపశమనంగా అనిపించినా భారీ వర్షం ఎప్పుడు ముంచుతుందో తెలియని పరిస్థితిని ధాన్యం రైతులు ఎదుర్కొంటున్నారు. తోట్లవల్లూరు, పెనమకూరు, రొయ్యూరు గ్రామాల్లో రహదారులు, కళ్లాల్లో ధాన్యం ఉండిపోయింది. రైతులు ఎక్కడికక్కడ పరదాలు కప్పి ధాన్యాన్ని జాగ్రత్త పరచుకున్నారు. వ్యవసాయశాఖ ద్వారా పరదాలు పంపిణీ చేయటం కొందరు రైతులకు ప్రయోజనం కలిగింది. అయితే ఉదయం నుంచి సాయంత్రం వరకు కాటాలు వేసినప్పటికీ ధాన్యం బస్తాలు మిల్లుకు తరలించేందుకు వాహనాలు లేక అలాగే ఉండిపోవటంతో పరదాలు కప్పి ఉంచామని రైతులు చెప్పారు.


తోట్లవల్లూరులో..

యూటీఎఫ్ కార్యవర్గం

కూచిపూడి: మొవ్వ మండల యూటీఎఫ్ నూతన కౌన్సిల్ సమావేశాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ ఎన్నికల్లో మండల అధ్యక్షుడిగా ఎం.రవీంద్ర బాబు, ప్రధాన కార్యదర్శిగా ఎం.రత్నగిరిరావు, గౌరవ అధ్యక్షుడిగా కె.బ్రహ్మం, సహాధ్యక్షుడిగా వై.వి.సతీష్, సహాయధ్యక్షురాలిగా ఎస్.నీలిమ, కోశాధికారిగా కె.శివనాగరాజు, కార్యదర్శులుగా వి.నాగ శ్రీనివాస్, బి.జయరాం, కుమార్, కె.గాయత్రి, బి.సుధీర్ మంజూష, రాజేంద్ర ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఉత్సవ్ మిలాప్‌ను జయప్రదం చేయాలి

గుడివాడ, నవంబరు30(ఆంధ్రజ్యోతి) : స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం వద్ద ఈ నెల 9వ తేదీన నిర్వహించనున్న 16వ ఐక్య క్రిస్మస్ ఉత్సవ్ మిలాప్‌ను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు కంచర్ల సుధాకర్ కోరారు. ఆదివారం స్థానిక గుడ్‌మెన్‌పేటలోని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం వద్ద ఉత్సవ్ మిలాప్ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు అద్దంకి మాణిక్యాలరావు, గుడివాడ బోసుబాబు, పసలాది శేఖర్ పాల్గొన్నారు.

ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తాం

● ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

గుడ్లవల్లేరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఆరుగాలం కష్టించి పండించిన ప్రతి ధాన్యపు గింజనూ కొనుగోలు చేస్తామని గుడివాడ ఎమ్మెల్యే వెనిగండ్ల రాము పేర్కొన్నారు. ఆదివారం పెంజంద్ర, డోకిపర్రు గ్రామాల్లో అయన పర్యటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ తుఫాను సమీపిస్తున్న వేళ రైతులు తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన రైతులకు వివరించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో రైతులకు మిల్లర్లు సహకరించాలని విజ్ఞప్తిచేశారు. రైతులకు ఇతర జిల్లాలకు ధాన్యాన్ని విక్రయించే వెసులుబాటు కల్పించారన్నారు. ట్రాన్స్‌పోర్టుకు ఇబ్బందిగా మారిన జియోట్యాగింగ్ విధానాన్ని తొలగించారన్నారు. రైతన్న సమస్య తన సమస్యగా భావించి నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో పర్యటిస్తున్నాన్నారు. పర్యటనలో భాగంగా ఇతర జిల్లాలకు చెందిన మిల్లర్లను వెంటబెట్టుకొని వెళ్లి , రైతులతో మాట్లాడించారు. రైతులకు ఎటువంటి సమస్య తలెత్తినా గ్రామాల్లో కూటమి నాయకుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు కొసరాజు బాపయ్యచౌదరి, గుడ్లవల్లేరు మార్కెట్ కమిటీ ఛైర్మన్ పొట్లూరి రవికుమార్, పెంజంద్ర పీఏసీఎస్ ఛైర్మన్ బొప్పన శివ ప్రసాద్, నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జ్ బూరగడ్డ శ్రీకాంత్, వీరమాచినేని శివప్రసాద్, డోకిపర్రు పీఏసీఎస్ ఛైర్మన్ చింతపల్లి శివాజీరెడ్డి, డీసీ వైస్ ఛైర్మన్ వీరమాచినేని నాగజయరాం, చిలకా నాగరాజు, గుడపాటి వెంకటేశ్వరరావు, పోలవరపు వెంకటరావు, రేమల్లె పెంటయ్య, జయప్రకాష్, కోటయ్య, బంగారి, మహ్మద్ బేగ్, జానీ తదితరులు పాల్గొన్నారు.


పెంజంద్రలో రైతులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెనిగండ్ల

జడ్పీ పాఠశాల 100ఏళ్ల వేడుకకు ఏర్పాట్లు

● నిమ్మగడ్డ శంకర్


సమావేశంలో మాట్లాడుతున్న పూర్వ విద్యార్థులు

పెదపారుపూడి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): వానపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 100 సంవత్సరాల వేడుకలు ఘనంగా నిర్వహించాలని పూర్వ విద్యార్థులు గుడివాడ త్రివేణి పబ్లిక్ స్కూల్ ఎండీ నిమ్మగడ్డ శంకర్ అన్నారు. ఆదివారం వానపాముల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ వానపాముల పాఠశాల 100 సంవత్సరాలు నిండాయని నూజివీడు జమీందార్ , వానపాముల వేములపల్లి చిన్న రామయ్య 1925 సంవత్సరంలో పాఠశాలని ప్రారంభించారని తెలిపారు. ఈ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులు పద్మభూషణ్ అవార్డు ఏ.నారాయణ సీవీఆర్ ఛానల్, చలసాని వెంకటేశ్వరరావు, యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్, కామినేని హాస్పటల్ ఎండీ సూర్యనారాయణ, అట్లూరి వెంకటేశ్వరరావు, వికాస్ కోటేశ్వరరావు, సూరపనేని వీరభద్రరావు ఉన్నతమైన స్థానంలో ఉన్నారని తెలిపారు. పాఠశాల 100 సంవత్సరాలైన సందర్భంగా డిసెంబరు 16వ తేదీన పూర్వపు విద్యార్థులందరూ కలసి వేడుకను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్యేలు వర్ల కుమార్ రాజా, వెనిగండ్ల రాము పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పునుకొల్లు గురు ప్రసాద్, కొల్లి చంద్రశేఖర్ రావు, పునుకొల్లు శివరాం ప్రసాద్, కొమ్మారెడ్డి రామచంద్రరావు, విశ్వేశ్వరరావు, సుంకర దామోదర్‌రావు, రామచంద్రరావు, పట్నాల శాంతిచారి, షేక్ అస్సాం అహ్మద్, గణేష్, సూర్యదేవరాయ లక్ష్మణరావు, శివరామకృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

రైతులు అప్రమత్తంగా ఉండాలి

●వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మి

గుడివాడ రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులు దిత్వా తుఫాను నష్టానికి అందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారిణి బోలెం అనంతలక్ష్మీ అన్నారు. ఆదివారం తట్టివర్రు, రామన్నపూడి తదితర గ్రామాల్లోని రైతులతో ఏవో మాట్లాడారు. వరి కోతలు కోయవద్దని రైతులకు సూచించారు. సోమ, మంగళవారాల్లో వర్షాలు కురుస్తాయన్న విషయం తెలిసినందున వరి కోతలు వాయిదా వేయాలన్నారు. ధాన్యం రాశులు రోడ్లపై ఉంచితే పరదాలు కప్పుకోవాలన్నారు. వరి కంకులు మొలకలు వచ్చే అవకాశం ఉందని అనుమానం వస్తే 5 శాతం ఉప్పునీటి ద్రావణాన్ని పిచికారి చేసుకోవాలని తెలిపారు. వరి కోత కోయాల్సిన వరి పొలాల్లో నీరు నిల్వ ఉంచకుండా చూసుకోవాలని తెలిపారు. ఎప్పటికప్పుడు వ్యవసాయశాఖాధికారుల పర్యవేక్షణ ఉంటుందని, ధాన్యం అమ్ముకోవటానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. ప్రజలు, రైతులు వారి కుటుంబాలు జాగ్రత్తగా ఉండి ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉండాలని తెలిపారు.


తట్టివర్రులో రైతులతో మాట్లాడుతున్న అనంతలక్ష్మి

పెదపారుపూడి: రైతులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీను నాయక్ అన్నారు. యలమర్రులో రైతులతో మాట్లాడుతూ దిత్వా తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వర్షం కురిసే అవకాశం ఉన్నందున రైతులు ఈ మూడు రోజులపాటు తాత్కాలికంగా వరి కోతలను వాయిదా వేసుకోవాలన్నారు. కోత కోసి పనల మీద ఉన్న వరిని వెంటనే కుప్పలు వేసుకుని పరదాలతో కప్పుకోవాలని, మెరక ప్రదేశాల్లో ఆరబెట్టుకుంటున్న వరిని బస్తాల్లోకి నింపుకొని సురక్షిత ప్రదేశాలకు తరలించాలని సూచించారు. పంటను కాపాడుకోవటానికి అవసరమైన గోనె సంచులు, వాహనాలు, టార్పాలిన్ పట్టాలు పంపిణీ, గోడౌన్లను అందుబాటులో ఉంచామన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీను నాయక్

బ్రాయిలర్ ధరలు



అమరావతి	(రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్	132, 141, 152
చికెన్ విత్ స్కిన్	250
చికెన్ స్కిన్‌లెస్	260

నెక్ కోడిగుడ్డు ధర (100)

విజయవాడ జోన్ రైతు ధర రూ. 665

దిత్వా తుఫాను నేపథ్యంలో మీకోసం రద్దు

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జరగాల్సిన మీకోసం కార్యక్రమం రద్దు చేసినట్టు కలెక్టర్ డీకే బాలాజీ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా అధికారులు దిత్వా తుఫాను రక్షణ చర్యలు, ముందస్తు జాగ్రత్తలపై దృష్టి సారిస్తున్న దృష్ట్యా మీ కోసం కార్యక్రమం రద్దు చేసామన్నారు. సోమవారం జిల్లా అధికారులందరూ కలెక్టరేట్‌లో అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశించారు.



శ్రావ్య కృష్ణ హాస్పటల్‌ను ప్రారంభిస్తున్న కేన్సర్ వైద్య నిపుణులు చంద్రశేఖర్, ఆసుపత్రి నిర్వాహకులు డాక్టర్ అశ్వనికుమార్, డాక్టర్ శ్రావ్య కృష్ణలు

చల్లపల్లిలో శ్రావ్య కృష్ణ ఆసుపత్రి ప్రారంభం

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : చల్లపల్లిలో డాక్టర్ అశ్వనికుమార్ శీలం, డాక్టర్ శ్రావ్య కృష్ణ దంపతులు ఆధ్వర్యంలోని శ్రావ్యకృష్ణ హాస్పటల్‌ను ప్రముఖ క్యాన్సర్ వైద్యనిపుణులు డాక్టర్ సింహాద్రి చంద్రశేఖర్ ఆదివారం ప్రారంభించారు. స్వచ్ఛ చల్లపల్లి సారథి, ప్రముఖ డాక్టర్ డీఆర్కే ప్రసాద్, డాక్టర్ సబ్బినేని భవానీప్రసాద్, డాక్టర్ నల్లపనేని కీర్తి, ఎమ్మెల్యే తనయుడు, యువనేత మండలి వెంకట్రామ్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు, మంత్రి కందుల దుర్గేష్ కుమారుడు కందుల కృష్ణతేజ అతిథులుగా పాల్గొని ఐసీయూ, ఆపరేషన్ థియేటర్‌లను ప్రారంభించారు. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలనీ, మం చిపేరు ప్రఖ్యాతులు సాధించాలని ఆకాంక్షించారు. తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, ఎంపీపీ కోట విజయరాధిక, జడ్పీటీసీ సభ్యుడు మెడబలిమి మల్లిఖార్జునరావు, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, ఏఎంసీ ఛైర్‌పర్సన్ తోట కనకదుర్గ, మండవ బాలవర్ధి, కోనేరు మారుతీప్రసాద్, మత్తి వెంకటేశ్వరరావు, డాక్టర్ వేణు, శీలం శ్రీరాములు, అనిల్‌కుమార్ వైద్యులు, పురప్రముఖులు పాల్గొన్నారు.



యోగా మాస్టర్లు రమేష్, స్వర్ణలతను సత్కరిస్తున్న మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చని మునిసిపల్ మాజీ ఛైర్మన్ మోటమర్రి బాబాప్రసాద్ అన్నారు. మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం సన్‌స్టార్ జూనియర్ కళాశాలలో జరిగిన కార్యక్రమంలో జాతీయ స్థాయి యోగా పోటీలకు ఎంపికైన ఆడిటర్ రమేష్, టీచర్ స్వర్ణలతలను బాబాప్రసాద్ సత్కరించారు. మాన వత అధ్యక్షుడు జి.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ, కృష్ణావిశ్వవిద్యాలయంతో పాటు విద్యా సంస్థల్లో విద్యార్థులకు మోటివేషన్ తరగతులు నిర్వహించనున్నామన్నారు. జిల్లా విద్యానిధి కన్వీనర్ శ్రీరామ్ మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకునేందుకు రూ. 28 లక్షల విద్యానిధిని సేకరించామన్నారు. కార్యదర్శి హసీంబేగ్ మాట్లాడుతూ, పేద విద్యార్థులను ఆదుకోవడంలో సంస్థ ముందంజలో ఉందన్నారు. సంస్థ ఉపాధ్యక్షుడు బొమ్మిడి స్వామి, స్టార్ కళాశాల ప్రిన్సిపాల్ ఆది త్య, వెత్స సత్యనారాయణ మూర్తి పాల్గొన్నారు.



సింహాద్రి వాణీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్, సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

దివిసీమ కవయిత్రి వాణీకి ఒంగోలులో సత్కారం

నాగాయలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కళామిత్ర మండలి ఆధ్వర్యంలో ఒంగోలులో ఎన్టీఆర్ కళాక్షేత్రం 19వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి వేడుకల సందర్భంగా రాష్ట్రస్థాయి కవి సమ్మేళనం జరిగింది. దివిసీమకు చెందిన కవయిత్రి, ఉగాది పురస్కారం గ్రహీత సింహాద్రి వాణి పాల్గొని తమ కవితను చదివి సభికులను అలరించారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, మాజీ జేడీ లక్ష్మీనారాయణ నిర్వాహకులు జ్ఞాపికతో ఆమెను ఘనంగా సత్కరించారు.



మాక్ అసెంబ్లీలో మాట్లాడిన మహేజబ్బిన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్

మహేజబ్బిన్‌కు ఎమ్మెల్యే కాగిత అభినందన

బంటుమిల్లి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని మాక్ అసెంబ్లీలో ప్రతిభను చాటిన ఎండి సఫా మహేజబ్బిన్‌ను ఆదివారం పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ ఘనంగా సత్కరించారు. కృత్తివెన్ను మండలం చిన పాండ్రాక జిల్లా పరిషత్ హైస్కూల్ పదో తరగతి విద్యార్థిని ఎండీ సఫా మహేజబ్బిన్‌నకు ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఉన్నత శిఖరాలను అధిరోహించాలని, మాతృభూమికి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని ఆయన అన్నారు. తల్లిదండ్రులకు, పఠశాల ఉపాధ్యాయులకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.



మోర్ల వెంకటేశ్వరరావు మాస్టారుకు సత్కారం

అవనిగడ్డ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పదవీ విరమణ సందర్భంగా అవనిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల ఇంగ్లీష్ అసిస్టెంట్ మోర్ల వెంకటేశ్వరరావును ఆదివారం పాఠశాల విద్యాకుటుంబం ఘనంగా సత్కరించింది. విద్యార్థులు, తల్లిదండ్రులు మోర్ల వెంకటేశ్వరరావు సేవలను కొనియాడారు.



సుల్తానగరంలో టార్పాలిన్లు కప్పిస్తున్న తహసీల్దార్ మధుసూదనరావు



కోడూరులో రైతులను అప్రమత్తం చేస్తున్న మండలి వెంకట్రామ్



పాగోలులో వరికుప్పలు వేస్తున్న కూలీలు



మల్లాయి చిట్టూరు పొలాల్లో ధాన్యపు రాశులు

రైతుల్లో దిత్వా అలజడి

- పంటను కాపాడుకునేందుకు తంటాలు
- అప్రమత్తం చేస్తున్న జేసీ

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫానుతో రైతుల గుండెల్లో రైళ్లు పరుగెడు తున్నాయి. పంట తయారు కాకుండానే మొంథా తుఫాను నష్టం కలుగ చేయగా, కొద్దోగొప్పో పంట చేతికి వస్తుందనుకుంటుంటే దిత్వా తుఫాను వణికిస్తోంది. బందరు మండలంలో దాదాపు ఐదు వేల ఎకరాల్లో పంటలను రైతులు కోసి ధాన్యాన్ని రోడ్లపై, ఇళ్లల్లో ఆరబెట్టుకుంటున్నారు. కూలీలతో వరి కోతలు కోసిన రైతులు కుప్పలు వేసుకుంటున్నారు. జాయింట్ కలెక్టర్ నవీన్ ఆధ్వర్యంలో పంట నష్టం నివారణకు యుద్ధ ప్రాతిపదిక టార్పాలిన్‌లు అందిస్తున్నారు. తహసీల్దార్లు నాగభూషణం, మధుసూదనరావు, మండల వ్యవసాయ శాఖాధికారి శివకుమార్ గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తూ రైతులను అప్రమత్తం చేస్తున్నారు. ఆదివారం అరిసేపల్లిలో టార్పాలిన్‌లు అందజేశారు. సుల్తానగరం తదితర ప్రాంతాల్లో జాతీయ రహదారి పక్కన ఆరబెట్టుకున్న ధాన్యంపై టార్పాలిన్‌లు కప్పించారు.

వరి కోతలు వాయిదా వేసుకోవాలి

తెలుగురావుపాలెం, చినకళ్లేపల్లి, ఘంటసాలపాలెం గ్రామాల్లో వరి కోతలను ఘంటసాల తహసీల్దార్ బి.వి జయప్రసాద్ నిలుపుదల చేశారు. వర్షం ముంచుకొస్తున్న విషయం తెలిసినా మిషన్‌తో కోతలు కోయటం సరికాదని, కోతలు వాయిదా వేయాలంటూ రైతులకు నచ్చచెప్పారు. ఘంటసాల, కొడాలి గ్రామాల్లో ధాన్యం భద్రపర్చుకోవాలన్నారు.

ఘంటసాల మండలంలో..

ఘంటసాల : ఆదివారం ఉదయం ఆకాశం మేఘావృతం కావటం, మధ్యాహ్నం చిరుజల్లులు ప్రారంభం కావటంతో రైతులు తమ పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడుతున్నారు. పనల మీద ఉన్న పంటను పోగు చేసుకుంటూ, మిషన్ సాయంతో కోసిన ధాన్యాన్ని కాపాడుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. వివిధ ప్రాంతాల్లో రహదారుల వెంబడి, పొలాల గట్ల మీద ధాన్యం రాశులు దర్శనమిస్తున్నాయి.

ఎటుచూసినా ధాన్యపు రాశులే

చల్లపల్లి : దిత్వా తుఫాను రైతులను కలవరపెడుతోంది. తుఫాను గ్రామాల్లో ఎటుచూసినా ధాన్యపురాశులే దర్శనమిస్తున్నాయి. పచ్చిగా ఉన్న ధాన్యం కావటంతో జాతీయ రహదారిపై, గ్రామాల్లో ఖాళీ స్థలాల్లో రాశులు పోసి ఆరబెట్టుకున్నారు. తేమశాతం 23 వరకు ఉన్న ధాన్యాన్ని ప్రథమ ప్రాధాన్యతగా అధికారులు దగ్గరుండి కొనుగోలు చేయించి రైస్‌మిల్లులకు తరలిస్తున్నప్పటికీ గ్రామాల్లో ధాన్యపు రాశులు పెద్దఎత్తున ఉన్నాయి. ఆదివారం వాతావరణంలో మార్పులు సంభవించి వర్షం పడుతుండటంతో రైతన్నలో ఆందోళన నెలకొంది. కోతలు పూర్తయి పనలమీదున్న వరిని హడావుడిగా కుప్పలు వేసుకుని పరజాలు కప్పుకుని పంటను రక్షించుకున్నారు. మరికొన్ని చేలలో వరిపంట పనలమీద ఉంది. వర్షం పెరిగిపెద్దదైతే పనలు తడిచిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు. ధాన్యపు రాశులు, బస్తాలపైనా పరదాలు కప్పుతున్నారు.

కన్నీటి పర్యంతమవుతున్న రైతులు

మోపిదేవి : ఆదివారం ఉదయం నుంచి దిత్వా తుఫాన్ ప్రభావంతో వర్షం ప్రారంభం కావటంతో రహదారులపై గుట్టలుగా పోసి ఉన్న ధాన్యాన్ని చూసి రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. వరి కోతలు కోసిన రైతులు హడావిడిగా కుప్పలు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసి యంత్రాల ద్వారా నూర్పిడి చేసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ సక్రమంగా లేకపోవటంతో గుట్టలుగా ధాన్యం రాశులు పడి ఉన్నాయి. పెదప్రోలు, వెంకటాపురం, కొక్కిలిగడ్డ, మోపిదేవి, రావివారిపాలెం, పెదకళ్లేపల్లి, కె.కొత్తపాలెం గ్రామాల్లో వరి కోత యంత్రాల ద్వారా నూర్పిడి చేశారు. తేమశాతం నిబంధనలు రైతులకు గుదిబండగా మారాయి. సరిపడినంత గోనె సంచులు లేకపోవటం, ధాన్యాన్ని మిల్లులకు తరలించేందుకు సరిపడిన వాహనాలు లేకపోవటంతో రోజుల తరబడి పడిగాపులు పడాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



రంగుమారిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

బంటుమిల్లి : రంగుమారిన, మానుగాయి ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. మల్లేశ్వరం, అర్తమూరు, సాతులూరు గ్రామాల్లో ధాన్యం రాశులను పరిశీలించారు. ప్రభుత్వం నిబంధనలు సడలించి రంగుమారిన మానుగాయి ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘం జిల్లా కార్యదర్శి గౌరిశెట్టి నాగేశ్వరరావు, బంటుమిల్లి మండల రైతు సంఘం అధ్యక్షుడు మలిశెట్టి శివరామ్ ప్రసాద్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

అపోహలు నమ్మొద్దు : వెంకట్రామ్

కోడూరు : ధాన్యం తక్కువ ధరకు కొంటున్నారనే అపోహలు రైతులు నమ్మవద్దని యువనేత మండలి వెంకట్రామ్ అన్నారు. కోడూరు, లింగారెడ్డిపాలెం గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను, సంత మార్కెట్ ఆవరణలోని గోడౌన్‌ను పరిశీలించారు. రైతు సేవ కేంద్రాల ద్వారా 30 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని రూ.1563లకు, 17 శాతం తేమ ఉన్న ధాన్యాన్ని రూ.1776లకు కొనుగోలు చేస్తున్నట్లు తెలిపారు. రైతులు డైరెక్ట్‌గా మిల్లర్ల వద్దకు ప్రైవేట్ బెరగాళ్ల వద్దకు వెళ్లి మోసపోవద్దని సూచించారు. రైతులు అవసరమైతే, సంత మార్కెట్ వద్ద ఉన్న గోడౌన్ వాడుకోవాలని సూచించారు. పీసీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు తిరుపతి శ్రీనివాసరావు, తహసీల్దార్ సౌజన్య కిరణ్మయి, పీఏసీఎస్ ఛైర్మన్లు పూతబోయిన కరుణకుమార్, కోట సుబ్బారావు, జనసేన టౌన్ అధ్యక్షులు కోట రాంబాబు, కాగిత రామారావు, సొసైటీ సీఈవోలు నగరాయులు, చిట్టిప్రోలు సుబ్బారావు పాల్గొన్నారు.

టార్పాలిన్లు పంపిణీ

బంటుమిల్లి, : దిత్వా తుఫాను ప్రభావంతో ఎ ఆదివారం మధ్యాహ్నం జల్లులు పడడంతో రైతులు తీవ్ర ఆందోళన చెందెతున్నారు. ధాన్యం రాశులపై పరదాలు కప్పుతున్నారు. ప్రభుత్వం స్పందించి ముందస్తుగా పరదాలు పంపిణీ చేసింది. మార్కెట్‌యార్డు డైరెక్టర్ వక్కలగడ్డ కరుణకుమార్ మాట్లాడుతూ తుఫాను అనంతరం టార్పాలిన్లను ప్రభుత్వానికి తిరిగి ఇవ్వాలన్నారు.

దిక్కుతోచని రైతన్న

కోడూరు : దిత్వా తుఫాను అన్నదాతల గుండెల్లో అలజడి సృష్టిస్తోంది. ప్రస్తుతం వరి కోతల సమయం కావటంతో ఆదివారం వర్షం కురవడంతో అన్నదాతలు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. మండల పరిధిలోని పలు గ్రామాల్లో ఏ రోడ్డుపై చూసిన ధాన్యం రాశులే దర్శనమిస్తున్నాయి. తడవకుండా కప్పుకునేందుకు శ్రమిస్తున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలు వేగవంతం చేయాలని కోరుతున్నారు.

రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలి

నాగాయలంక : దిత్వా తుఫాను కారణంగా కోస్తాంధ్రలో సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో రైతులు వరి కోతలను రెండు రోజులపాటు వాయిదా వేసుకోవాలని ఏవో ఏ.సంజీవ్ కుమార్ సూచించారు. తప్పనిసరి పరిస్థితుల్లో కోతలను అన్నదాతలు కోసినట్లయితే అందుబాటులో రైతు సేవా కేంద్రాలను సంప్రదించాలని ఆయన కోరారు. ఆరబెట్టిన ధాన్యానికి టార్పాలిన్ కప్పుకోవాలని సూచించారు.



ఏ ఒక్కరైతుకు నష్టం కలిగించొద్దు

మోపిదేవి : ఏ ఒక్క రైతు వర్షం కారణంగా నష్టపోకుండా చూడాలని అవనిగడ్డ టీడీపీ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాసరావు, జనసేన నాయకులు మండలి వెంకట్రామ్, దివి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఛైర్మన్ కొల్లూరి వెంకటేశ్వరరావు మిల్లర్లకు సూచించారు. రావివారిపాలెం, కప్తానుపాలెం, పెదప్రోలు గ్రామాల్లో పర్యటించారు. ధాన్యాన్ని వెంటనే కొనుగోలు కేంద్రాలు, సురక్షిత ప్రాంతాలకు తరలించుకునే ఏర్పాట్లు చేయాల్సిందిగా సూచించారు. తహసీల్దార్ ఎం.హరినాథ్, ఏవో హెప్సిబా రాణి, ప్రత్యేకాధికారి హజీజ్ బేగ్, మండల టీడీపీ అధ్యక్షులు బండే శ్రీనివాసరావు, కూటమి నేతలు బొబ్బా గోవర్ధన్, దిడ్ల జానకిరాంబాబు, బల్లా సీతారామ ప్రసాద్, చందన రంగారావు, మేడికొండ విజయ్, కోట సాయి, కర్రా సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

జీవనతత్వం తెలిపే దివ్యగ్రంథం భగవద్గీత

- పోటీలకు మంచి స్పందన



భగవద్గీత పోటీల విజేతలతో ఆలయ వంశపారంపర్య ధర్మకర్త ముత్తేవి రవికాంత్

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భగవద్గీత మానవాళికి జీవనతత్వం తెలిపే దివ్యగ్రంథమని బచ్చుపేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం వంశపారంపర్యధర్మకర్త ముత్తేవి రవికాంత్ అన్నారు. హిందూ ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు భగవద్గీత కంఠస్థ పోటీలు నిర్వహించారు. హిందూ ధర్మ పరిషత్ ప్రతినిధి తురగా ప్రసాద్ పర్యవేక్షించగా, మడమల రాంబాబు, గురజాడ రాజేశ్వరి, బృందావనదాస్, టీటీడీ ధర్మాచారిణి జొన్నలగడ్డ మాధవి, గరికపాటి వీరాంజనేయులు, శ్రీవారి సేవకులు శ్రీకాంత్, నాగలక్ష్మి, మాజేటి లక్ష్మీకాంతం, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. మోకా అప్పారావు గీతాలు వీనుల విందు చేశాయి. ఇంటర్, టెన్త్ విభాగం పోటీల్లో సిహెచ్. ధనలక్ష్మి, కందుల మణికంఠ, కె. కీర్తన మొదటి మూడు బహుమతులు, చింతా రఘురామ్‌కు కన్సొలేషన్ బహుమతి, 6,7,8,9 తరగతుల విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో ఆర్. నీతిక, పి. మేధశ్రీ, ఏ. గోపీ మొదటి మూడు బహుమతులు, మట్టా పల్లవి, రాజ్యలక్ష్మిలకు కన్సొలేషన్ బహుమతి అందజేశారు. పెద్దలకు నిర్వహించిన పోటీల్లో ఆర్. స్వాతి, సిహెచ్. ధరణిలక్ష్మి, కె. సౌజన్యలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు అందజేశారు.

జొన్నలగడ్డ గురుదత్త ప్రతిభ

కొడాలి నుంచి వచ్చిన ఐదేళ్ల జొన్నలగడ్డ గురుదత్త భగవద్గీత శ్లోకాలను అద్భుతంగా వినిపించాడు. గురుదత్త ప్రతిభకు న్యాయనిర్ణేతలు మంత్ర ముగ్ధులయ్యారు. నిర్వాహకులు తురగా ప్రసాద్ ప్రత్యేక బహుమతిని అందజేశారు. తిరుమల తిరుపతి దేవస్థానం ధర్మప్రచారిణి మాధవి వద్ద గురుదత్త భగవద్గీతలో శిక్షణ పొందడం విశేషం.

గిరిజన హక్కుల సాధనకు ఉద్యమిస్తాం: శంకరనాయక్

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మైదాన ప్రాంత గిరిజన హక్కుల సాధనకై ఉద్యమిస్తామని గిరిజన హక్కుల సమాఖ్య జాతీయ అధ్యక్షుడు, ఎస్టీ కమిషన్ మాజీ సభ్యుడు వి.శంకరనాయక్ అన్నారు. మచిలీపట్నంలోని ఎన్ కన్వెన్షన్ హాలులో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజనులకు అసెంబ్లీలో తగినంత ప్రాధాన్యత కల్పించాలన్నారు. రాజునాయక్, కార్పొరేటర్ ఏకసిరి వెంకటేశ్వరరావు, గిరిజన నాయకులు పద్మరాజు, రవినాయక్, శంకరనాయక్, సాలా నాగరాజు, పాండురంగారావు, కిరణ్, హనుమంతనాయక్, సత్యనారాయణ, వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు పెద్దపీట



కాగిత వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న యార్లగడ్డ సుబ్బలక్ష్మి

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మహిళలకు కూట మి ప్రభుత్వంలో పెద్దపీట వేశారని, మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించారని, డ్వాక్రా మహిళలకు రుణాలు పెద్ద ఎత్తున అందిస్తున్నారని మాజీ ఎంపీపీ, బందరు మండల టీడీపీ అధ్యక్షుడు కాగిత వెంకటేశ్వరరావు అన్నారు. కాగిత వెంకటేశ్వరరావును రూరల్ మండల తెలుగు మహిళ సంయుక్త కార్యదర్శి యార్లగడ్డ సుబ్బలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిశారు. కాగిత వెంకటేశ్వరరావును ఆమె సత్కరించారు.

అగ్నిబాధిత కుటుంబానికి రెడ్‌క్రాస్ సాయం



చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రామానగరం అగ్ని బాధిత యర్రారపు వీరాంజనేయులు కుటుంబ సభ్యులను రెడ్‌క్రాస్ జిల్లా ఛైర్మన్ డాక్టర్ డీఆర్కే ప్రసాద్ ఆదివారం పరామర్శించి, రూ.ఐదు వేల సహాయాన్ని అందిం చారు. చల్లపల్లి సబ్‌బ్రాంచ్ ఆధ్వర్యం నిత్యావసర సరుకులు, సామాగ్రి డీఆర్కే చేతుల మీదుగా అందించారు. సబ్‌బ్రాంచ్ ఛైర్మన్ లీలాబ్రహ్మేంద్ర, వైస్‌ఛైర్మన్ మధుసూదనరెడ్డి, కోశాధికారి ఎండీఏకె.జిలానీ, ఆకురాతి హరిప్రసాద్, బళ్లా మధుసూదనరావు తదితరులు పాల్గొన్నారు.

కోడూరు సమస్యలపై చంద్రబాబుకు వినతి



చంద్రబాబుకు సమస్యలు వివరిస్తున్న శ్రీనివాసరావు

కోడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : కోడూరు మండల సమస్యలపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు వినతిపత్రం అందజేసినట్లు మండల టీడీపీ అధ్యక్షుడు బండే శ్రీనివాసరావు తెలిపారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రిని ఇటీవల మర్యాదపూర్వకంగా కలిశామన్నారు. అవుట్ ఫాల్ స్లూయిజ్ గేట్లు పాడైన కారణంగా గత ఆరు సంవత్సరాలుగా మండల పరిధిలో ఐదు వేల ఎకరాలు సాగుకు నోచుకోలేదని, 22ఏ నిషేధిత జాబితాలో వేలాది ఎకరాల భూములు చేర్చడంతో రైతులు తీవ్రంగా ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే రైతుల సమస్యలు పరిష్కరించాలని కోరినట్లు తెలిపారు.

నామినేటెడ్‌లో తెలుగుయువతకు ప్రాధాన్యత ఇవ్వాలి

నాగాయలంక, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మండల తెలుగు యువత అధ్యక్షులు మేడికొండ విజయ్ శనివారం రాత్రి మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని మర్యాదపూర్వకంగా కలిశారు. నామినేటెడ్ పదవుల్లో తెలుగు యువతకు ప్రాధాన్యతనివ్వాలని కోరుతూ వినతిపత్రం అందించినట్లు ఆయన తెలిపారు.

చిట్టిపాలెంలో ఉచిత వైద్యశిబిరం

మచిలీపట్నం టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : పేదల సేవే సాయి సేవ అని సత్యసాయి సేవా సమితి కన్వీనర్ పోతుకూచి ఆంజనేయకుమార్ అన్నారు. చిట్టిపాలెంలో సత్యసాయి గ్రామీణ మొబైల్ సంచార సేవా శిబిరాన్ని ఆదివారం నిర్వహించారు. పేదలకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. 150 మంది రోగులకు వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. డాక్టర్ శివప్రసాద్, డాక్టర్ నిఖి, డాక్టర్ సుధారాణి, డాక్టర్ ఆదిత్యమూర్తి, డాక్టర్ దుర్గ, గోవర్ధన గిరిరాజు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ల పంపిణీ

చల్లపల్లి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ నుంచి పంటను రక్షించుకునేందుకు రైతులకు 320 టార్పాలిన్ పట్టాలను అందజేశారు. మొవ్వ ఏఎంసీ ఛైర్‌పర్సన్ తోట కనకదుర్గ, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఏవో కె.మురళీకృష్ణ, ఆర్ఐ ఘంటసాల కృష్ణమోహన్, వీఆర్వోలు ఎం.ప్రశాంత్, పి.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

